ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 08 పేజీలు : 8+8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 19 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 08 PAGES : 8+8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 19 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# ట్రబుల్ షూటర్ కు విషమ పరీక్ష..

## హరీశ్ జిల్లాల బాట జూబ్లీహిల్స్ ఎఫెక్టేనా.?

- గతంలో ఉమ్మడి మెదక్ కే పరిమితం
- వరంగల్, మహబూబాబాద్ జిల్లాల పర్యటనలో మాజీమంత్రి
- జూబ్లీహిల్స్ ఓటమి తర్వాత కేడర్లో జోష్ నింపేందుకే.. బీఆర్ఎస్ వర్గాల్లో హాట్ టాపిక్



**హైదరాబాద్ పెన్ పవర్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమితో గులాబీ పార్టీ డీలా పడిపోయింది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు జిల్లాల బాట పట్టారు. ట్రబుల్ షూటర్ గా పేరున్న హరీశ్ రావు జూబ్లీహిల్స్ బైపోల్ ఓటమి తర్వాత నైరా శ్యంలోకి వెళ్లిన కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు బయల్దేరారనే టాక్ ఉంది. అటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ కూడా అదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు. పార్టీ రజతోత్సవ సభ తర్వాత హరీశ్ రావు జిల్లాల పర్యటనకు బ్రేక్ పడింది. ఒక వేళ వెళ్లాల్సి వచ్చినా బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. అనూహ్యం గా బావాబావమర్దులు ఇద్దరూ జిల్లాల పర్యటనకు వెళ్లడం కారు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.


**రజతోత్సవం తర్వాత సిద్దిపేటకే పరిమితం**

2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటు న్నారు. అసెంబ్లీకి సైతం రెండు మూడు సార్లు మాత్రమే హాజరయ్యారు. ముఖ్యంగా ఫాంహౌస్ లోనే ఉంటున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలోనూ ఆయన ప్రచారం.. నిర్వహించలేదు. పార్టీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు కీలకంగా వ్యవహరి స్తున్నారు, ఏప్రిల్ 27 న నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఇన్ చార్జిగా మొదట హరీశ్ రావు పేరు ప్రకటించిన కేసీఆర్ తర్వాత పక్కన పెట్టేశారు. మిగతా నేతలందరినీ కేసీఆర్ తెరపైకి తెచ్చారు. ఆ తర్వాత క్రమంగా ఉమ్మడి మెదక్ జిల్లాకు.. తర్వాత సిద్దపేటకు పరిమితం చేశారు. తర్వాత కూడా ఆయన జిల్లాల పర్యటనకు వెళ్లాల్సి వస్తే గులాబీ బాస్ కేసీఆర్ అనుమతి తీసుకో వాల్సిన పరిస్థితి ఉందని టాక్ ఉంది.

**జోష్ నింపేందుకే..**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో బీఆర్ఎస్ ఘోర పరాజ యం పాలైంది. పార్టీ కేడర్

వివరాలు 2లో..



## మావోయిస్టు కీలక నేత హిడ్మా మృతి...



- మారేడుమిల్లి ఎన్ కౌంటర్ లో హిడ్మా, ఆయన భార్య రాజే సహా మొత్తం ఆరుగురు మావోయిస్టులు మృతి
- ఉదయం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా తలపై రూ.6 కోట్ల రివార్డు

వివరాలు 2లో..



## ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది

- షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో జైశంకర్ సందేశం
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించకూడదన్న జైశంకర్
- ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించకూడదన్న జైశంకర్

హైదరాబాద్ పెన్ పవర్:భారత ప్రజలను ఉగ్రవాదం నుంచి రక్షించుకునే హక్కు దేశానికి ఉందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## మహిళలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్..

### నేటి నుంచి ఇందిరమ్మ చీరల పంపిణీ




**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో కోటి మంది మహిళలకు కోటి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం (నవంబర్ 19) లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ చీరల కు సంబంధించి మంత్రి సీతక్కతో పాటు ఉన్నతాధి కారుల సమావేశంలో సీఎం సమీక్షించారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ కోసం చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా చీరల పంపిణీని రెండు దశల్లో

వివరాలు 2లో..

## దేశానికి పెద్దన్నగా నరేంద్ర మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి

- తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్న రేవంత్ రెడ్డి
- ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్న సీఎం



దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నా రు. హైదరాబాద్‌లోని

వివరాలు 2లో..

## విజయవాడ, కాకినాడలో మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశాం

- విజయవాడ, కాకినాడలో 31 మంది మావోయిస్టుల అరెస్ట్
- ఆటోనగర్‌లో కూలీల వేషంలో తలదాచుకున్న నక్సల్స్
- ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అగ్రనేతలు కూడా అరెస్ట్ అయిన వారిలో ఉన్నట్టు సమాచారం
- ఏఓబీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం
- పక్కా సమాచారంతోనే అరెస్టులు చేసినట్లు వెల్లడించిన ఇంటెలిజెన్స్ చీఫ్



వివరాలు 2లో..

## నేడు ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన



- పుట్టపర్తి, కోయంబత్తూరులో ప్రధాని మోదీ పర్యటన
- పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు హాజరు
- సత్యసాయి స్మారక నాణెం, స్టాంపుల విడుదల కార్యక్రమం
- కోయంబత్తూరులో పీఎం-కిసాన్ 21వ విడత నిధుల విడుదల
- 9 కోట్ల మంది రైతులకు రూ. 18,000 కోట్లకు పైగా ప్రయోజనం

వివరాలు 2లో..

## ఓటమికి బాధ్యత వహిస్తూ మౌనదీక్ష చేపట్టబోతున్న ప్రశాంత్ కిశోర్

- బీహార్ ఎన్నికల ఓటమికి పూర్తి బాధ్యత తనదేనన్న ప్రశాంత్ కిశోర్
- ప్రజల నమ్మకాన్ని గెలవడంలో విఫలమయ్యామని అంగీకారం
- ప్రాయశ్చిత్తంగా ఈ నెల 20న మౌన ఉపవాసం చేయనున్నట్లు ప్రకటన

హైదరాబాద్ పెన్ పవర్:బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయానికి తానే పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు జన్ సురాజ్ పార్టీ అధినేత, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. ఫలితాల అనంతరం తొలిసారిగా మీడియాతో మాట్లాడిన ఆయన, తమ పార్టీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేకపోయిందని అంగీకరించారు. ఈ వైఫల్యానికి ప్రాయశ్చిత్తంగా ఈ నెల 20న గాంధీ భీతిహర్వా ఆశ్రమంలో ఒకరోజు మౌన ఉపవాసం చేయనున్నట్లు తెలిపారు."బీహార్ రాజకీయాల్లో మార్పు తీసుకురావాలనే

వివరాలు 2లో..




## మీకు మరో 4 నెలలే టైమ్.. తుపాకులు వదిలి బయటకు రండి

### మావోయిస్టులకు కేంద్రమంత్రి బండి పిలుపు



హైదరాబాద్ పెన్ పవర్: మావోయిస్ట్ అగ్రనేత హిడ్మా ఎన్ కౌంటర్ పై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళ వారం (నవంబర్ 18) వేములవాడలో

వివరాలు 2లో..

## బీఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదు

- బీఆర్ఎస్ ఓటమి, కొత్త పార్టీ ఏర్పాటుపై కవిత కీలక వ్యాఖ్యలు
- కుట్ర చేసి తనను పార్టీ నుంచి బయటకు పంపారని ఆరోపణ
- ప్రస్తుతానికి కొత్త పార్టీ ఆలోచన లేదని వెల్లడి
- తుమ్మల వంటి నేతను వదులుకోవడం వల్లే బీఆర్ఎస్ అధికారానికి దూరమైందని విశ్లేషణ
- భవిష్యత్తులో తామే బాధ్యతాయుత ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని ప్రకటన



వివరాలు 2లో..

## ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం...

### మనీలాండరింగ్ జరిగినట్టు అనుమానం

- ఐ-బొమ్మ కేసు దర్యాప్తులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- మనీలాండరింగ్ కోణంలో విచారణకు ఈడీ సిద్ధం
- బెట్టింగ్ యాప్స్, క్రిప్టో వాలెట్ల ద్వారా నిధుల సమీకరణ
- నిందితుడి ఖాతాలోని రూ.3.5 కోట్లను ఇప్పటికే ఫ్రీజ్ చేసిన పోలీసులు

హైదరాబాద్ పెన్ పవర్:తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐ-బొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీగా ఆర్థిక అవకతవకలు, మనీలాండ రింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ, లోతైన దర్యాప్తు చేపట్టేం దుకు సమాయత్తమవుతోంది.ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# విడదలకు షాకివ్వనున్న జగన్.. ఈసారి ఎక్కడికో తెలుసా?

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. మాజీ మంత్రి విడదల రజినీని మరో నియోజకవర్గానికి పంపాలని నిర్ణయించినట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి విజయం సాధించిన విడదల రజని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా జగన్ కేబినెట్ లో పనిచేశారు. అయితే అక్కడ వైసీపీ నేతలకు, నాటి ఎంపీ, ఎమ్మెల్సీకి పడకపోవడంతో 2024 ఎన్నికల్లో విడదల రజనీని గుంటూరు వెస్ట్ నియోజకవర్గానికి ఇన్ ఛార్జిగా నియమించింది. అక్కడి నుంచే పోటీ చేయించింది. అయితే ఆ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ఓటమి పాలయింది. గుంటూరు వెస్ట్ నుంచి విడదల రజనీ కూడా ఓటమిపాలయ్యారు. అయితే ఆమె తనను తిరిగి చిలకలూరి పేట నియోజకవర్గం ఇన్ ఛార్జి గా నియమించారు.

**పార్టీ పరిస్థితి బాగుపడకపోగా...**

అయితే విడదల రజని వెళ్లిన తర్వాత పార్టీ పరిస్థితి ఏ మాత్రం బాగుపడలేదని పార్టీ నాయకత్వానికి సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో చిలకలూరిపేటలో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని వైసీపీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలిసింది. విడదల రజనీని గుంటూరు జిల్లాలోని రేపల్లెకు విడదల రజనీని పంపే అవకాశాలున్నాయని అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. చిలకలూరిపేట, గుంటూరు వెస్ట్ నియోజకవర్గం కంటే విడదల రజనీకి రేపల్లె సరైన నియోజకవర్గమని జగన్ కూడా భావిస్తున్నారు. దీంతో చిలకలూరిపేటలో కార్యక్రమాలు తగ్గించుకోవాలని రేపల్లెకు వెళ్లేందుకు సిద్ధం కావాలని అధిష్టానం స్పష్టమైన సమాచారం ఇచ్చినట్ల తెలిసింది. ఈనేపథ్యంలో మరోసారి విడదల రజనీ వర్గం తీవ్ర నిరాశలోకి వెళ్లింది.

**త్వరలోనే అధికారిక ప్రకటన...**

మాజీ మంత్రి విడదల రజనీ త్వరలో వైసీపీ ఇంచార్జ్ గా రేపల్లెకు బదిలీ అయ్యే అవకాశాలున్నాయని ఆమెకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. దీంతో విడదల రజనీ ఆశ్చర్యంతో పాటు అసంతృప్తికి గురయ్యారని చెబుతున్నారు. చిలకలూరిపేటలో ఆమె ఎప్పటికీ గెలిచే పరిస్థితి లేదని ఆమె ఎప్పటికీ అక్కడ బలమైన అభ్యర్థి కాలేరన్న అభిప్రాయం బలంగా ఉండటంతో ప్రత్యామ్నాయం చూడాలని జగన్ సిద్ధపడినట్లు చెబుతున్నారు. రేపల్లెలో ప్రస్తుతం ఈపూరు గణేష్ ఇంచార్జ్ గా ఉన్నారు, కానీ ఆయన ఎక్కడా కనిపించడం లేదు. అక్కడ వైసీపీకి నాయకత్వం లేకుండా పోయింది. అది బీసీల నియోజకవర్గం కావడం మత్స్యకార వర్గానికి చెందిన తెలంగాణ ముదిరాజ్ వర్గానికి చెందిన విడదల రజనీ అయితే మంచి అభ్యర్థి అవుతారని వైసీపీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# విజయవాడ, కాకినాడలో మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశాం

విజయవాడ, కాకినాడ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు అదనపు డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్డా వెల్లడించారు. ఈ పరిణామం రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించింది. అరెస్ట్ అయిన వారిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొందరు ముఖ్య నేతలు కూడా ఉన్నట్లు సమాచారం.విజయవాడ శివారులోని కానూరు న్యూ ఆటోనగర్‌లో ఉన్న నాలుగు అంతస్తుల భవనంలో మావోయిస్టులు ఆశ్రయం పొందుతున్నారని ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన భద్రతా బలగాలు ఆ భవనాన్ని చుట్టుముట్టి తనిఖీలు చేపట్టాయి. ఈ సోదాల్లో ఒకేచోట 27 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది మహిళలు ఉండటం గమనార్హం. వీరంతా ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన కూలీల ముసుగులో ఎవరికీ అనుమానం రాకుండా ఇక్కడ నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యాదర్శి తిప్పిరి తిరుపతి బృందం ఉన్నట్టు తెలుస్తోంది. విజయవాడ ఆటోనగర్‌లోని ఫ్యాక్టరీలు, టింబర్ డిపోలలో ఛత్తీస్‌గఢ్, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు పెద్ద సంఖ్యలో పనిచేస్తుంటారు. ఇదే అదునుగా భావించిన మావోయిస్టులు, వారిలో కలిసిపోయి ఆశ్రయం పొందారు. కృష్ణా జిల్లా, విజయవాడ, కాకినాడ ప్రాంతాల్లో కలిపి మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు అదనపు డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్డా అధికారికంగా ప్రకటించారు. గత నెల రోజులుగా వీరి కదలికలపై నిఘా పెట్టినట్లు ఆయన వెల్లడించారు.తాజాగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిర్వహించిన ఆపరేషన్‌లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య రాజే కూడా ఉన్నారు.
ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లు జరగడం, ఛత్తీస్‌గఢ్‌లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో, అక్కడి నుంచి తప్పించుకున్న మావోయిస్టులు ఏపీలోని అంతర్గత ప్రాంతాల్లోకి ప్రవేశించి ఉంటారని అధికారులు
అనుమానిస్తున్నారు.ప్రస్తుతం మావోయిస్టులకు ఆశ్రయం కల్పించిన భవన యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరికి ఎవరు సహకరించారు, ఏవైనా దాడులకు ప్రణాళికలు రచించారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే, వారి నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారా లేదా అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో మావోయిస్టుల కార్యకలాపాలు ఉధృతంగా ఉన్న రోజుల్లో కూడా ఏపీలోని ఒక నగరంలో ఇంత పెద్ద సంఖ్యలో నక్సల్స్‌ను అరెస్ట్ చేయడం ఇదే తొలిసారని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఘటనతో రాష్ట్ర పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు.

# నేడు ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించ నున్నారు. పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడంతో పాటు, కోయంబత్తూరులో జరిగే రైతుల సదస్సులో పీఎం కిసాన్ 21వ విడత నిధులను విడుదల చేయనున్నారు.ఈ పర్యటనపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "నవంబర్ 19న పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో పాల్గొనడం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని నా సోదర సోదరీమణుల వద్దకు వెళ్లాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని పేర్కొన్నారు. సత్యసాయి బాబా సమాజ సేవను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని గుర్తు చేసుకున్నారు.షెడ్యూల్ ప్రకారం, ప్రధాని బుధవారం ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం చేరుకుని, శ్రీ సత్యసాయి బాబా మహాసమాధిని సందర్శించి నివాళులర్పిస్తారు. అనంతరం 10:30 గంటలకు జరిగే శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా గౌరవార్థం ఒక స్మారక నాణెం,
ప్రత్యేక స్టాంపులను విడుదల చేసి, సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.అక్కడి నుంచి ప్రధాని మోదీ తమిళనాడులోని కోయంబత్తూరుకు బయలుదేరి వెళతారు. మధ్యాహ్నం 1:30 గంటలకు 'దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సు 2025'ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 9 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చేలా పీఎం కిసాన్ పథకం 21వ విడత కింద రూ. 18,000 కోట్లకు పైగా నిధులను విడుదల చేస్తారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల నుంచి సుమారు 50,000 మంది రైతులు, నిపుణులు పాల్గొననున్నారు.

# ఓటమికి బాధ్యత వహిస్తూ మౌనదీక్ష చేపట్టబోతున్న ప్రశాంత్ కిశోర్

- మొదటి పేజి తరువాయి

లక్ష్యంతో కొత్త పాత్ర పోషించాం. కానీ ప్రజలు మమ్మల్ని తిరస్కరించారు. మా ఆలోచనల్లోనే ఎక్కడో లోపం ఉండి ఉంటుంది. వంద శాతం బాధ్యత నాదే. చాలా నిజాయతీగా ప్రయత్నించాం, కానీ విఫలమయ్యాం. ఈ నిజాన్ని అంగీకరించడానికి ఎలాంటి ఇబ్బంది లేదు" అని ప్రశాంత్ కిశోర్ అన్నారు. గత మూడేళ్లుగా తన శక్తినంతా ధారపోసి పనిచేసినా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అయితే, తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని పీకే స్పష్టం చేశారు. బీహార్‌ను బాగు చేయాలనే తన సంకల్పం నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. "నేను తప్పులు చేసి ఉండొచ్చు, కానీ ఎలాంటి నేరం చేయలేదు. కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టలేదు. హిందూ-ముస్లిం రాజకీయాలు చేయలేదు. డబ్బులిచ్చి ఓట్లు కొనే నేరానికి పాల్పడలేదు" అని వ్యాఖ్యానించారు.ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేసిన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సురాజ్.. ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోవడమే కాకుండా, అభ్యర్థులంతా డిపాజిట్లు కోల్పోవడం గమనార్హం.

# మావోయిస్టు కీలక నేత హిడ్మా మృతి... నిర్ధారించిన పోలీసులు

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా మృతిచెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య రాజే, మరో నలుగురు మావోయిస్టులు పోలీసుల ఎదురుకాల్పుల్లో మరణించారు. ఈమేరకు హిడ్మా, రాజే మరణించిన విషయాన్ని పోలీసులు నిర్ధారిస్తూ వారి మృతదేహాల ఫొటోలను రిలీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలకు సంబంధించి కచ్చితమైన సమాచారంతో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు ఈరోజు ఉదయం కూంబింగ్ చేపట్టాయని ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు.

**గెరిల్లా దాడుల వ్యూహకర్త..**

చిన్న వయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీకి ఎంపికైన హిడ్మా.. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరొందారు. ఆయన స్వస్థలం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామం. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ హిడ్మా పనిచేశారు.

**మృతులు..**

మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్.

# మీకు మరో 4 నెలలే టైమ్.. తుపాకులు వదిలి బయటకు రండి

- మొదటి పేజి తరువాయి

ఆయన మీడి యాతో మాట్లాడుతూ.. హిడ్మా మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అయినప్పటికీ ఏరి పారేశామని.. ఇప్పుడు హిడ్మా, ఆయన భార్య సాధించిందేటని ప్రశ్నించారు. మావోయిస్టులతో దేశానికి, రాష్ట్రానికి ఏమైనా లాభం ఉందా.. మైనర్లకు తుపాకులు ఇచ్చి అడవులకు పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ నక్సల్స్ మాయలో పడి మావోయిస్టులు మోసపోయి ప్రాణాలు కోల్పోవద్దని సూచించారు.

"అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో కుటుంబ సభ్యులతో కలిసి జల్సా చేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పైరవీలు చేసుకుంటూ ఆస్తులు కూడగట్టుకుని కార్లలో తిరుగుతున్నారు. వాళ్ల మాటలు నమ్మి అమాయకులు తుపాకీ పట్టుకుని అడవుల్లో తిరుగుతూ తిండీ తిప్పలేక ప్రాణాలు కోల్పోతున్నారు. అర్బన్ నక్సల్స్ చెప్పేదొకటి. చేసేదొకటి. మావోయిస్టుల మరణాలకు అర్బన్ నక్సల్సే కారణం. వారి మాటలు నమ్మి మోసపోవద్దు.మంచి ఆలోచనలతో సమాజంలోకి రండి. ప్రజలకు సేవ చేయండి" అని పిలుపునిచ్చారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవడానికి మరో 4 నెలల సమయం మాత్రమే ఉందని, 2026 మార్చినాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. మావోలు లొంగిపోయేంతవరకు ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్కౌంటర్లు కొనసాగుతూనే ఉంటాయని తేల్చి చెప్పారు.

ఆంధ్రప్రదేశ్?లోని అల్లూరి జిల్లా రంపచోడవరం పరిధిలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో 2025, నవంబర్ 18న జరిగిన భారీ

ఎన్ కౌంటర్?లో మావోయిస్ట్ అగ్రనేత, సెంట్రల్ కమిటీ మెంబర్ హిడ్మా హతమయ్యాడు. హిడ్మాతో పాటు ఆయన భార్య రాజే అలియాస్ రాజక్కతో పాటు మరో నలుగురు ఎన్ కౌంటర్?లో మృతి చెందారు. మావోయిస్టు పార్టీలో శక్తివంతమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్జీఏ) బెటాలియన్ 1కి కమాండర్?గా ఉన్న హిడ్మా మరణం మావోయిస్టు పార్టీకి భారీ ఎదురు దెబ్బ. ఇప్పటికే నంబాల, చలపతి, భాస్కర్ రావు వంటి అగ్రనేతలు ఎన్ కౌంటర్లో హతం కాగా.. తాజాగా హిడ్మా కూడా అసువులు బాయడం మావోయిస్ట్ పార్టీ ఉద్యమానికి తీరని నష్టంగా మారనుంది.

# ట్రబుల్ షూటర్ కు విషమ పరీక్ష..

- మొదటి పేజి తరువాయి

నైరాశ్యంలోకి. వెళ్లిపో యింది. దీంతో జిల్లాల్లో పర్యటిం చాలని హరీశ్ రావును ఆదేశించినట్టు తెలుస్తోంది. క్రమంలోనే ఆయన ఇవాళ వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ట్రబుల్ షూటర్ గా పేరున్న హరీశ్ రావు గులాబీ సైన్యంలో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు జిల్లాల బాట పట్టాల్సి వచ్చిందనేది బీఆర్ఎస్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# మహిళలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్..

## నేటి నుంచి ఇందిరమ్మ చీరల పంపిణీ

- మొదటి పేజి తరువాయి

చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. తొలి దశలో ఇందిరా గాంధీ జయంతి (నవంబర్ 19) నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. చీరల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని చెప్పారు. సాంకేతికను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని చెప్పారు.

# బీఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ పార్టీపై, తన రాజకీయ భవిష్యత్తుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌తో తనకు ఇప్పుడు ఎలాంటి సంబంధం లేదని, కుట్రపూరితంగా తనను, తన కుటుంబాన్ని పార్టీకి దూరం చేశారని ఆరోపించారు. ప్రస్తుతానికి కొత్త రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేశారని, ఆ పార్టీతో తన బంధం తెగిపోయిందని కవిత తేల్చిచెప్పారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరరావును పార్టీ వదులుకోవడమే బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణమని విశ్లేషించారు. తుమ్మల లాంటి నేతను దూరం చేసుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పని అన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తనకు, జాగృతి కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కనీస గుర్తింపు కూడా లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణలో అధికార, ప్రతిపక్షాలు రెండూ తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యాయని కవిత విమర్శించారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో తామే బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను పోషిస్తామని ప్రకటించారు. సామాజిక తెలంగాణ సాధనే తన ఆశయమని, అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కవిత విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేస్తున్నా ని, బీసీల ద్రోహిగా మిగిలిపోతారని ఆరోపించారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని ఎద్దేవా చేశారు. సీతారామ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని, పత్తి రైతులకు మద్దతు ధర కల్పి ంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లో సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని కవిత ప్రకటించారు.

# దేశానికి పెద్దన్నగా నరేంద్ర మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి

- మొదటి పేజి తరువాయి

హెూటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు.ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకమవుతుందని అన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఇక్కడ మరో కొత్త నగరాన్ని నిర్మించాలని చూస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, మిగతా సమయాల్లో పరస్పరం సహకారంతో అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు.

ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు మోదీ నేతృత్వంలోని కేంద్రం కృషి చేస్తోందని, ఈ క్రమంలో కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందని అన్నారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. కేంద్రం 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని నిర్దేశించుకుందని, అందులో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలని భావిస్తున్నట్లు చెప్పారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్రం సహకారం ఉండాలని కోరారు. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించినట్లే తాము తెలంగాణ మోడల్ తీసుకువచ్చామని, కాబట్టి తన రాష్ట్రానికి ఇచ్చిన సహకారం తమకూ ఇవ్వాలని అన్నారు. మోదీ సబర్మతి ప్రక్షాళన చేసినట్లుగా తాము మూసీని చేస్తున్నామని అన్నారు.

# ఇళ్ల స్థలాల పంపిణీకి అర్హులైన పేదలను గుర్తించండి

**అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**



**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 18,**పలమనేరు మున్సిపల్ పరిధిలో ఇంటిపట్టాల పంపిణీకి అర్హులైన పేద లబ్ధిదారుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సూచించారు. పట్టణం లోని ఆయన కార్యాలయంలో రెవిన్యూ మరియు మున్సిపల్ అధికారులతో మంగళవారం ఆయన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి టౌన్ హాల్,డ్రైనేజీ, చెరువు అభివృద్ధి పనుల తదితరుల అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇప్పటిదాకా పేదల నుంచి ఇళ్లస్థలాల కోసం అందిన అర్జీలను పారదర్శకంగా పరిశీలించి నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు.ఇదివరకే స్థలాలు కలిగి ఇంటి రుణాలు అవసరమైన లబ్ధిదారులను సైతం వార్డు వారీగా గుర్తించి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని తెలిపారు.అతి త్వరలో పేదలకు పట్టాలు పంపిణీ చేసేలా అధికారులు పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ సమీక్షలో తహసీల్దార్ ఇన్నునాథన్,మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి,డీఈ సురేష్,ఏఈ స్నేహప్రియా,టీపీఎస్ ఇందిరా,సర్వేయర్ ఆంజనేయులు తదితరులున్నారు.

# జోనల్ ఏరియా కోఆర్డినేటర్ దీపక్ రెడ్డిని కలిసిన గాలి మురళి నాయుడు



**శ్రీకాళహస్తి , పెన్ పవర్,నవంబర్ 18 :**శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు,తిరుపతి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు దీపక్ రెడ్డిని కలిసి,తాము 21 సంవత్సరాలుగా పార్టీ అధ్యక్షులుగా వైస్ ఎంపీపీగా మరియు తమ కుటుంబం నుంచి జెడ్పిటిసిగా అనసూయమ్మ మరియు మా గ్రామానికి చెందిన ఎంపీపీ కోవిపోలమ్మ,దివంగత నేత మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి హయాంలో నాలుగు దఫాలుగా మండలంలోని తెలుగుదేశం పార్టీ తరపున ఎంపీటీసీలు,సర్పంచులు,జడ్పీటీసీలను మండలానికి అందించిన ఘనత తమ కుటుంబానికి ఉందని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో తప్ప మిగిలిన అన్ని ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ డంకా మోగించిందని దీపక్ రెడ్డికి వివరించారు.అనంతరం బయోడేటాను ఇవ్వమని కోరగా దీపక్ రెడ్డికి బయోడేటాను అందించి, శాలువాతో సత్కరించగా మీకు తగిన న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అంకయ్య చౌదరి, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి చెన్న రాఘవులు యాదవ్ తదితర నాయకులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# ప్రాణాలను కాపాడడం కంటే పవిత్ర కార్యం మరొకటి లేదు

## జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు.




**కావలి :పెన్ పవర్ –(ఆర్సీ ఇంచార్జ్ )నవంబర్ 18** సాటి మనిషి ప్రాణాలను కాపాడడం కంటే పవిత్రమైన కార్యం మరొకటి లేదని శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల కరెస్పాండంట్ కె కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కావలి శాఖ జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల నందు 400 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కడ ప్రాణాపాయం ఉంటుందో అక్కడ రెడ్ క్రాస్ ప్రాణాలను కాపాడేందుకు ముందుంటుందని అన్నారు. కేవలం రక్తసహాయమే కాకుండా ప్రాథమిక చికిత్స, విపత్తు నిర్వహణలో శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ , కావలి రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు మరియు జూనియర్ రెడ్ క్రాస్ అడ్వైసర్ బెజవాడ ప్రసన్నకుమార్, జూనియర్ రెడ్ క్రాస్ కళాశాలల కన్వీనర్ పి సాయి కుమార్, జూనియర్ రెడ్ క్రాస్ పాఠశాలల కన్వీనర్ జి హరినాథ్ మరియు రెడ్ క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# తెల్లదొరలకు నిద్రలేకుండా చేసిన ధీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి

**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 18,**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి)ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ సమీపంలోని ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి జయంతి ఉత్సవం జరిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తిరుపతి ఎబివిపి విభాగ్ సంఘటన కార్యదర్శి సాయి సత్యనారాయణ మరియు పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు,సీనియర్ న్యాయవాది ఎల్. భాస్కర్ మాట్లాడుతూ.. తెల్లదొరలకు నిద్రలేకుండా చేసిన దీరావనిత ఝాన్సీ లక్ష్మీబాయి అన్నారు.ఆ మహానుభావురాలి అసలు పేరు మణికర్ణిక అని 1828వ సంవత్సరం నవంబరు 19న మహారాష్ట్రలోని వారణాసిలో జన్మించిందని, తల్లిదండ్రులు మోరోపంత్ తాంబే, భాగీరథీబాయిలు అని అన్నారు.ఆమె తల్లి చాలా తెలివైనదీ, ఆధ్యాత్మిక ధోరణి మెండుగా ఉండి లక్ష్మీబాయిని ముద్దుగా మను అని పిలుచుకొంటూ చిన్నప్పటి నుండీ కత్తిసాము,గుర్రపుస్వారీ,తుపాకీ పేల్చడం వంటి విద్యలంటే మనూకు మక్కువ ఎక్కువ.ఖడ్గం ధరించి,కళ్ళెం బిగించి గాలి విసురుకు ఉవ్వెత్తుగా ఎగిరే కురులతో గుర్రపు స్వారీ చేస్తూ నానాసాహెబ్ వెంట మనూబాయి దూసుకొని పోయేదని అన్నారు. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసులోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైందని,దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది అని ఝాన్సీలో మే 10, 1857లో మీరట్ లో భారత సిపాయిల తిరుగుబాటు మొదలయిందని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మొదటి తిరుగుబాటుగా నిలిచిందని,ఈ సమయంలో ఝాన్సీ లక్ష్మీబాయి ముఖ్య పాత్ర పోషించారని,పందులంటే ముసల్మానులకు ద్వేషమని, హిందువులకు ఆవులంటే పవిత్రమైనవని తెలిసినా కాని,వాళ్ళు యుద్ధములో తుపాకి గుండ్లు తగలకుండా వేసుకొనే తొడుగులకు, వాళ్ళు వాడే తుపాకీలకు పందులు,ఆవుల కొవ్వుని పూసారు. బ్రిటిష్



అధికారులు వాళ్ళను వాటిని వాడవల్సిందిగా బలవంత పరిచి, ఎవరైతే వినలేదో వాళ్ళని శిక్షించడం మొదలుపెట్టారు అని ఇంతలో, మే 1857లో భారతదేశం ఉత్తర ఖండంలో మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం మొదలైందని ఈ క్లిష్ట పరిస్థితులలో ఆమె తన సత్తాని చాలా వేగంగా ప్రదర్శించి, ఝాన్సీ యుద్ధానికి సేనలను సమర్ధవంతంగా తయారుచేసింది.ఈ సమర్ధత వలన లక్ష్మీబాయి మధ్య కాలంలో వచ్చిన సామ్రాట్ల కలవర సమయములో కూడా ఝాన్సిని శాంతి యుతంగా ఉంచి 1858 మార్చి 23లో బ్రిటిష్ బలగాలు ఝాన్సీని ఆక్రమించుకున్నప్పుడు ఆమె యుద్ధ వీరులతో కలిసి లొంగకూడదని నిర్ణయించుకొని యుద్ధము సుమారు రెండు వారాలు జరిగి ఆమె తన బలగాలను తన చుట్టూ ఏర్పరచుకొని బ్రిటిష్ వాళ్ళకి వ్యతిరేకంగా చాలా భయంకరంగా యుద్ధం చేసి బ్రిటిష్ పాలకుల వెన్నులో వణుకు పుట్టించింది. మొట్టమొదటి స్వతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించిన వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి బ్రిటిష్ వాడి తూటాలకు యుద్ధభూమిలో దేహమైన ప్రాణమైన ఈ భరతమాతకే సమర్పణమంటూ భరతమాత ఒడిలో తుది శ్వాస విడిచింది. ఎంతో త్యాగము సాహసము చేసి మహిళ అంటే పూలు కాదు నిప్పు రవ్వలు భారత వీర మహిళలు అంటూ గుర్తుచేసి నేటి యువతీ యువకులకు ఆదర్శంగా నిలిచిన లక్ష్మీబాయి జీవిత చరిత్రను మనమందరం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.భారతదేశ భోగంతో కాదు త్యాగంతో నిండిందని ఇలాంటి ఎంతోమంది స్వతంత్ర వీరుల త్యాగ ఫలితమే మన స్వతంత్రమని స్వతంత్ర భారతావనిలో మన వంతు మనం ఏ దేశం కోసం సమయం ఇచ్చి దేశం కోసం ఆలోచన చేస్తూ నిత్యజీవితం కోసం జీవితం దేశం కోసం అని చెప్పిన వివేకానందుని మాటను మనం ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ ఏబీవీపీ నాయకులు వంశీకృష్ణ,కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# శతాయు ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో పైల్స్ కు ఉచిత వైద్య శిబిరం

**నాయుడుపేట, పెన్ పవర్, నవంబర్ 18**నవంబర్ 20 వరల్డ్ పైల్స్ డే సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని ఆంధ్ర బ్యాంక్ వీధిలో గల శతాయు ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో పైల్స్ కు సంబంధించిన వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చీఫ్ యానో రెక్టికల్ సర్జన్ డాక్టర్ అనిల్ ముసునూరు ఎమ్మెస్ ( ఆయుర్వేదిక్ ) ఒక ప్రకటనలో తెలియజేశారు. వరల్డ్ పైల్స్ డే సందర్భంగా ఈనెల 20 నుండి 30వ తేదీ వరకు తమ హాస్పిటల్ లో పైల్స్,ఫిషర్ ఇన్ ఎనో,ఫిష్టులా లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పై వ్యాధులకు ఓపితో పాటు ఉచిత మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్జరీ లపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. పైల్స్ డే సందర్భంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో సర్జరీలకు మొదటగా రిజిస్టర్ చేయించుకున్న 25 మంది కి మాత్రమే 50 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందని తెలియజేశారు. నాయుడుపేట పట్టణంతో పాటు చుట్టుపక్క మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని



ఆయన కోరారు.పూర్తి వివరాలకు 79010 33399 సెల్ నంబర్ కు సంప్రదించాలని తెలియజేశారు.

# కావలి కాలువకు సోమశిల జలాలను విడుదల చేసిన ఎమ్మెల్యేలు కాకర్ల, కావ్య,

**సంగం వద్ద సోమశిల జలాల విడుదల ం రైతాంగంలో ఆనందం వెల్లువ.**
**రెండోవ కారు పంటకు నీటి అందుబాటు: సోమశిల నుంచి కావలి కాలువకు జలాలు.**





కావలి :పెన్ పవర్ –(ఆర్సీ ఇంచార్జ్) నవంబర్ 18న

సంగం వద్ద కావలి కాలువకు సోమశిల జలాలను విడుదల చేసి, రెండోవ ఫేస్ లో రబ్బి పంటలకు నీటిని అందించేందుకు చేపట్టిన బృహత్తర కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ,కావలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి మరియు సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు ప్రజాప్రతినిధులు జలవిడుదలను అధికారికంగా ప్రారంభించి, రైతాంగంలో ఆనందం వెల్లివిరిసెల చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, యువనేత మంత్రి నారా లోకేష్ బాబు, కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు.

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా పడి అన్ని ప్రాజెక్టులు, చెరువులలో పుష్కలంగా నీరు నిండిపోయి నిండుకుండలను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పుష్కల వర్షాల వరదతో ఎన్నడూ లేని విధంగా రెండోవ కారు పంటకు నీరు విడుదల చేయడం రైతులకు ఎంతో ఆశాజనకమని, ఇది వ్యవసాయ రంగానికి పునర్జీవం నింపే నిర్ణయమని తెలిపారు. అలాగే రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ నిర్ణయాలను కూడా ఆయన వివరించారు. రేపు రెండో విడతగా రాష్ట్ర ప్రభుత్వం ‘అన్నదాత సుఖీభవ’ పథకం ద్వారా ప్రతి రైతు ఖాతాలో 5,000 రూపాయలు జమ చేయనున్నదని, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా అదనంగా 2,000 రూపాయలు రైతులకు చేరనున్నాయని పేర్కొన్నారు. ఈ రెండు పథకాల మద్దతుతో రైతుల భుజాలపై ఉన్న ఆర్థికభారం కొంతవరకు తగ్గి, పంట సాగు మరింత సులభమవుతుందని అన్నారు. అదేవిధంగా జల్ జీవన్ మిషన్ ద్వారా సోమశిల జలాలను ఉదయగిరి నియోజక వర్గంలోని ప్రతి ఒక్క ఇంటికి త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు అందించే విధంగా కృషి చేస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో గ్రామాభివృద్ధి సాధించాలి-ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి



**నాయుడుపేట, పెన్ పవర్, నవంబర్ 18**ప్రజా ప్రతినిధులు,అధికారులు సమిష్టి కృషితో గ్రామాభివృద్ధి సాధించాలని నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు.మంగళవారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన క్లీన్ అండ్ గ్రీన్ ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. గ్రామపంచాయితీ లలో పారిశుద్ధ్యన్ని,మెరుగుపరిచి స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలని సూచించారు.అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రహదారులు,ఆలయాలు, పాఠశాలల్లో మొక్కల పెంపకం చేపట్టి వాటిని సంరక్షించాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకొని సమన్వయంతో పని చేసి అభివృద్ధి సాధించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిడిఓ జాలిరెడ్డి,ఎంపీడీఓ కె.సురేష్ బాబు,పలువురు సర్పంచ్ లు ,ఉప సర్పంచ్ లు,గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ల సమస్యలు పరిష్కరించాలి...

**డి.ఎం.హె.ఓ. కి వినతి పత్రం అందజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు.**



**నెల్లూరు (పెన్ పవర్ )– నవంబర్ 18**ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారి సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంగళవారం డి.ఎం.హె.ఓ డాక్టర్ వి. సుజాత ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ భాను మహేష్ మాట్లాడుతూ గత వారంలో వచ్చిన 8 %జూఎ% సర్క్యులర్ పెట్టడం న్యాయం కాదని అన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పల్లె ల పరిధిలో ప్రస్తుతము జిల్లా సి హెచ్ ఓ ఎస్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఇన్సెంటివ్స్ అనేవి మా సాలరీ లో భాగం అని, సాలరీ సాలరీ లానే ఇవ్వాలని,8 %జూఎ% ఎఫ్ ఆర్ ఎస్ డిపార్ట్మెంట్ లో ఎక్కడ ఎవరికి లేదు అని ఇది వేయడానికి జిల్లా సి హెచ్ ఓ ఎస్ రెడీ గా లేరన్నారు. ఇది గత 2 సంవత్సరాలుగా హోల్డ్ లో ఉంది అని దీని మీద ఈ సంవత్సరము జరిగిన ప్రొటెస్ట్ లో భాగంగా వ్రాతపూర్వకంగా సి ఎఫ్ డబ్ల్యూ ఏపీ హోల్డ్ చేశారు అన్నారు. దీని మీద ఉన్న ఇబ్బందులను ఏపీ ఎంసీఏ నాయకులతో చర్చించిన తరువాత నిర్ణయం తీసుకుంటాము అని తెలిపారు. ఇలా ఒక్కసారిగా సర్క్యులర్ ఇవ్వడం సి హెచ్ ఓ ఎస్ కు భయాందోళనలు గురి చేసిందని దీనిని వెంటనే తీసివేసి ఫిక్స్ పే చేయాలని అలాగే రూట్ లెవెల్ లో ఉన్న సమస్యలు అన్నిటిని పరిష్కారం చేయాలని కోరారు.

జిల్లాలో సి హెచ్ ఓ ఎస్ కు రావలసిన రెంట్స్ ,ఎలక్ట్రిసిటీ బిల్లులు, జేఏఎస్ అమౌంట్, ఈ హెచ్ ఆర్ చేయడానికి ఉన్న టెక్నికల్ ఇబ్బందులు మరియు నెలలో ఒకసారి సి హెచ్ ఓ ఎస్ సమస్యలను తెలుసుకోవడానికి డి ఎం హెచ్ ఓ తో మీటింగ్ ఏర్పాటు పలు అంశాలమీద డిఎంహెచ్వో తో మాట్లాడడం జరిగిందని తెలిపారు. స్పందించిన డి ఎం హెచ్ ఓ మీ సమస్యలను పై అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారని అన్నారు.ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా ప్రెసిడెంట్ భాను మహేష్, ప్రధాన కార్యదర్శి రబేకా, నాయకులు హనుమా నాయక్, ప్రశాంతి, సుమాంజలి, అఖిల, మరియు మబ్జాని తదితరులు పాల్గొన్నారు.

# గులాబీకి బలం... బలగం సోషల్ మీడియానేనా... మెయిన్ స్ట్రీమ్ కు పక్కన పడేశారా...

**హైదరాబాద్, నవంబర్ 18, పెన్ పవర్:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ రాకముందు నుంచే గులాబీ పార్టీ విస్తృతంగా ప్రచారం మొదలు పెట్టింది. ఓటర్ల జాబితా నుంచి మొదలు పెడితే ప్రజల సమస్యల వరకు అన్నింటినీ వ్యూహంతో వెలుగులోకి తెచ్చింది. ఆటో కార్మికుల సమస్యల నుంచి మొదలు పెడితే ఆరు గ్యారెంటీ ల వరకు ప్రతి సమస్యను గులాబీ పార్టీ ప్రధానంగా ప్రస్తావించింది. వాస్తవానికి గులాబీ పార్టీ దూకుడు ముందు కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందని అందరూ అనుకున్నారు. పైగా కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో ముందుండి నడిచారు. అధికార పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.వాస్తవానికి గులాబీ పార్టీ దూకుడు చూస్తే చాలామంది జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో జరిగే పోయింది ఉప ఎన్నికల్లో గెలుస్తుందని అందరూ అనుకున్నారు. కొన్ని సర్వే సంస్థలు కూడా ప్రారంభంలో ఇదే విషయాన్ని ప్రకటించాయి.. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా తీన్ మారిపోయింది.. మొదటినుంచి కూడా ముందు వరుసలో ఉన్న గులాబీ పార్టీ అనూహ్యంగా వెనక్కి వెళ్ళిపోయింది.. దీంతో ఊహించని విధంగా అధికార పార్టీ రేసులోకి వచ్చింది. ప్రతిపక్ష గులాబీ పార్టీని డిఫెన్స్ లో పడేసి .. తిరుగులేని స్థాయిలో విజయాన్ని అందుకుంది. వాస్తవానికి గులాబీ పార్టీ ఇలా కావడానికి ప్రధాన కారణం సోషల్ మీడియానే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత గులాబీ పార్టీ కొన్ని పెయిడ్ సోషల్ మీడియా గ్రూపులను హైర్ చేసుకుంది. అందులో పని చేసేవారు పక్కా గులాబీ పార్టీ కార్యకర్తలుగా వ్యవహరించడం మొదలుపెట్టారు.. కాంగ్రెస్ పార్టీ మీద లేనిపోని విమర్శలు చేయడం ప్రారంభించారు. ఇవి కాస్త వ్యక్తిగతంగా ఉండడంతో జనాల్లో ఆలోచన మొదలైంది. ఇదే సమయంలో గులాబీ పార్టీ ప్రధాన మీడియాను దూరం పెట్టింది. వెబ్ సైట్ లను పట్టించుకోకుండా యూట్యూబ్ ఛానల్స్ ను నమ్ముకుంది. పోనీ అందులోనైనా వాస్తవాలు ప్రజలకు తెలిశాయా అంటే లేదు అని చెప్పాలి.. వాస్తవానికి ఈ సోషల్ మీడియాలో జరిగిన విష ప్రచారం వల్లే ప్రజలు ఆలోచించారు.. పైగా రెండు సంవత్సరాల కాంగ్రెస్




పరిపాలనలో జూబ్లీహిల్స్ మొత్తం నాశనమైనట్టు.. గులాబీ పార్టీ ప్రచారం చేసుకుంది. హైడ్రా మీద.. ఇతర గవర్నమెంట్ స్కీమ్స్ మీద అడ్డగోలుగా నెగిటివ్ ప్రచారం చేసింది. ఇవన్నీ కూడా జనాలను ఆలోచింపజేశాయి.గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులు పిచ్చిపిచ్చిగా కథనాలను.. ఇతర వ్యవహారాలను ప్రసారం చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. కేవలం సోషల్ మీడియాను మాత్రమే నమ్ముకోవడం వల్ల జూబ్లీహిల్స్ లో గెలవాల్సిన చోట.. గులాబీ పార్టీ పుట్టి మునిగింది.. వాస్తవానికి ప్రధాన మీడియాను ప్రజలు నమ్ముతుంటారు.. సోషల్ మీడియా ద్వారా కృత్రిమమైన హైప్ వస్తుంది. అది ప్రజలను ఓటు వేసేలా చేయదు. కానీ ఈ విషయం గులాబీ పార్టీకి ముఖ్యంగా కేటీఆర్ కు అర్థం కావడం లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన మీడియాను నమ్ముకుంది. వివిధ వెబ్సైట్ ల ద్వారా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో తమ గెలిస్తే ఏం చేస్తామో చెప్పగలిగింది. తద్వారా కాంగ్రెస్ పరిస్థితి మారిపోయింది. చివరికి ఊహించని విజయం దక్కి.. భారీ మెజారిటీ లభించింది

# శీతాకాలంలో రహదారులపై తీవ్రమైన పొగ మంచు వలన కనుమరుగవుతున్న రహదారులు

**హైదరాబాద్ పెన్ పవర్:** శీతాకాలం ప్రారంభంతో ములుగు జిల్లాలో రాత్రి, తెల్లవారుజామున తీవ్రమైన పొగ మంచు ఏర్పడుతోంది. దీనివల్ల రహదారులపై దర్శనమార్గం 10–%20 మీటర్లకే పరిమితమవుతూ,వాహనాలు ఒకదానికొకటి చూడకముందే ఢీకొనే సంఘటనలు పెరుగుతున్నాయి. దీనికి తోడు డ్రైవర్లు నిద్రలేమితో వాహనాలు నడపడం, అలాగే కొంతమంది తమ వాహనాలను ప్రధాన రహదారులపై ఎలాంటి లైట్లు లేదా రిఫ్లెక్టివ్ గుర్తులు లేకుండా పార్క్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవలి ఘటనలను పరిశీలించినప్పుడు ఇవే ప్రధాన కారణాలుగా బయటపడ్డాయని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి ఐపిఎస్ గారు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు శీతాకాలంలో ప్రజలు పాటించాల్సిన విస్తృత సూచనలు వెల్లడించారు: పొగ మంచుతో కూడిన వాతావరణంలో డ్రైవర్లు పాటించవలసిన జాగ్రత్తలు

1. అవసరం లేని ప్రయాణాలు మానుకోండి: పొగ మంచు అత్యధికంగా ఉన్న సమయాల్లో (ఉ. 4 గంటల నుండి 8 గంటల వరకు, రా. 10 గంటల తరువాత) ప్రయాణాలను వీలైనంత వరకు తగ్గించాలి.
2. హెడ్‌లైట్లు తప్పనిసరిగా లో బీమ్‌లో ఉంచాలి: హై బీమ్ పొగ మంచులో ప్రతిబింబించి మరోవైపు మనముందున్న రహదారిని కనబడకుండా చేస్తుంది.
3. ఫాగ్ లైట్లు ఉంటే వాటిని ఉపయోగించాలి: ఇవి రహదారికి తక్కువ ఎత్తులో వెలుగునిస్తూ ముందున్న భాగాన్ని స్పష్టంగా కనిపించేలా చేస్తాయి.
4. సేఫ్టీ డిస్టెన్స్ పాటించాలి: ముందున్న వాహనం నుండి సాధారణ కంటే మూడు రెట్లు ఎక్కువ దూరం పాటించాలి.
5. ఆకస్మిక బ్రేకులు వేయకుండా ఉండాలి. బదులుగా నెమ్మదిగా, తక్కువ వేగంతో డ్రైవింగ్ చేయాలి.
6. స్టే ఇన్ లైన్ డ్రైవింగ్: రోడ్ మార్కింగ్ లైన్స్ కనబడకపోయినా రహదారి అంచులను అనుసరిస్తూ డ్రైవింగ్ చేయాలి.
7. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే హాజర్డ్ లైట్లు ఆన్ చేయాలి: ప్రయాణ సమయంలో నిరంతరం హాజర్డ్ లైట్లు ఆన్ చేయడం ఇతర డ్రైవర్లను గందరగోళానికి గురిచేస్తుంది.

**నిద్రలేమి ప్రమాదకరం**

1. నిద్రపోకుండా వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం, ఇది మద్యం సేవించి డ్రైవింగ్ చేసినంత ప్రమాదకరం.
2. రాత్రిపూట దీర్ఘదూర ప్రయాణాలు చేసే డ్రైవర్లు ప్రతి 2 గంటలకు 10 నిమిషాలు తప్పనిసరిగా విరామం తీసుకోవాలి.
3. తీవ్రమైన అలసట, కళ్లెదురుగా మసకగా కనిపించడం, తరచుగా ఆవులింతలు %-% ఇవి నిద్రలేమికి సంకేతాలు. ఈ పరిస్థితుల్లో



వెంటనే వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకోవాలి.

**రహదారులపై వాహనాలు నిలిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు**

1. ప్రధాన రహదారుల మధ్యలో వాహనాలు పార్క్ చేయరాదు.
2. అత్యవసరమైనప్పుడు రహదారి అంచున పార్క్ చేసి,
హాజర్డ్ లైట్లు ఆన్ చేయాలి
వాహనం వెనుక భాగంలో ప్రతిబింబించే ట్రైయాంగిల్
ను కనీసం 20%–%30 మీటర్ల దూరంలో ఉంచాలి
3. రాత్రిపూట లేదా పొగ మంచు కురిసే సమయంలో రిఫ్లెక్టివ్ టేపులు, స్టికర్లు ఉన్న వాహనాలు ప్రమాదాన్ని తీవ్రంగా తగ్గిస్తాయి.

**పాదచారులు, బైక్ రైడర్లకు సూచనలు**

1. రాత్రి సమయంలో నల్లటి బట్టలు ధరించడం మానుకోండి. వేరే వాహనాలకు కనిపించడంలో ఇబ్బంది కలుగుతుంది.
2. బైక్‌లపై రిఫ్లెక్టివ్ జాకెట్లు, హెల్మెట్ పై రిఫ్లెక్టివ్ స్టికర్లు తప్పనిసరిగా ఉపయోగించాలి.
3. రహదారిని దాటేటప్పుడు రెండు వైపులా జాగ్రత్తగా పరిశీలించి దాటండి, ఆకస్మికంగా రోడ్డుపైకి రావద్దు.

**జిల్లా పోలీసులు తీసుకుంటున్న చర్యలు**

జిల్లాలోని ప్రధాన
రహదారులపై రాత్రి ప్రత్యేక నైట్ పెట్రోలింగ్ బృందాలను నియమిస్తున్నారు.
పొగ మంచు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు చేపడుతున్నారు.
ప్రమాదకర ప్రదేశాల్లో స్పీడ్ కంట్రోల్ డ్రైవ్స్, డ్రంక్ %డ% డ్రైవ్, ఓవర్‌స్పీడ్ చెక్కింగ్ మరింత ముమ్మరం చేయబడుతున్నాయి.
రహదారిపై నిలిచిన, చెడిపోయిన వాహనాలను వెంటనే తొలగించే చర్యలు
తీసుకోమని సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేశారు.
సమగ్ర ప్రజల బాధ్యతాయుతమైన సహకారం కీలకం
"పోలీసులు చేపడుతున్న చర్యలతో పాటు ప్రజల సహకారం అత్యంత కీలకం. ప్రతి వ్యక్తి బాధ్యతగా
వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. శీతాకాలం మొత్తం ఈ సూచనలు కచ్చితంగా పాటించాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం" అని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ పి ఐపిఎస్ గారు తెలిపారు.

# మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి కొల్లు రవీంద్ర

**హైదరాబాద్ పెన్ పవర్:**
కార్తిక మాసాన్ని పురస్కరించుకుని కృష్ణాజిల్లా మోపిదేవి లో వేంచేసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని మంగళవారం ఉదయం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆచరించారు. ఈ సందర్భంగా దేవాలయ వేదపండితులు పాలకవర్గ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు ఆచరింప చేశారు. దేవాలయంలో గల నాగేంద్ర స్వామి పుట్ట లో పాలు పోసి మంత్రి రవీంద్ర ప్రత్యేకఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం రోజు రోజుకు భక్తుల విశ్వాసాన్ని పెంపొందించుకుంటుందన్నారు. ఈ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగాఅన్ని చర్యలు తీసుకుంటామన్నారు.
ప్రతి మంగళవారం శుక్రవారం తో పాటు ఆదివారం ఈ దేవాలయానికి భక్తులు పోటెత్తుతున్నారని అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్తీకమాసంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతోసంతోషంగా ఉందన్నారు.

# పత్తి మార్కెట్ లో బీఆర్ఎస్ నేతల అందోళన

**ఖమ్మం పెన్ పవర్:** వ్యవసాయ పత్తి మార్కెట్ లో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పత్తి రైతుల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వివక్షతను నిరసిస్తూ ఆందోళన చేసారు. రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్నసమస్యల పై ఆందోళన కార్యక్రమలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరిగింది. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీతాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, చంద్రావతి తదితరులు పాల్గోన్నారు.కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేస్తున్నారా అన్ని రైతులను బీఆర్ఎస్ నేతలు అడిగి తెలుసుకున్నారు. తేమశాతం పేరుతో సరైన ధర ఇవ్వడం లేదని బీఆర్ఎస్ నాయకుల దృష్టి కీ పత్తి రైతులుతెచ్చారు. మార్కెట్లో సరైన ధర రాక నిలువు దోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కిసాన్ యాప్ రైతులకు అవగాహన లేదని.. రైతులకు అవగాహన కల్పించారా లేదా అనిమార్కెటింగ్ శాఖ అధికారులను బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు,. రైతులు పండించిన పత్తికీ తేమ శాతంతో సంబంధం లేకుండా తక్షణమే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు.

## మెట్ పల్లిలో కేటీఆర్ కు ఘనస్వాగతం



**కరీంనగర్: పెన్ పవర్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం సిరిసిల్ల నుంచి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు బయలుదేరారు. అయన పార్టీ శ్రేణులు మెట్ పల్లిలో ఘనస్వాగతం పలికారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పూలమొక్క ఇచ్చి స్వాగతం పలికారు. కేటిఆర్ వెంట ఆదిలాబాద్ కు బిఆర్ఎస్ నాయకులు బయలుదేరారు.

# గ్యాస్ సిలిండర్ పేలి ఆరుగురికి తీవ్ర గాయాలు ఇల్లు దగ్ధం

**సిద్దిపేట పెన్ పవర్:** గ్యాస్ సిలిండర్ పేలి కుటుంబ సభ్యుల ఆరుగురికి తీవ్ర గాయాలై ఇల్లు దగ్ధమైన సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శెట్టె భాస్కర్ గ్యాస్ ముట్టించగా లీకై ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలింది. ఇంట్లో ఉన్న భాస్కర్ తో సహా తండ్రి అయ్యల్లం, భార్య కావ్య ముగ్గురు పిల్లలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. మంటలు చెలరేగుతూ ఇల్లు దగ్ధమైంది. స్థానికులు
మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

# ఏనుమాముల మార్కెట్ ను పరిశీలించిన హరీష్ రావు

**వరంగల్: పెన్ పవర్:** మాజీ మంత్రి హరీష్ రావు మంగళవారం నాడు ఎనుమాముల వ్యవసాయ కేంద్రాన్ని సందర్శించి పత్తిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ అడ్డగోలు నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేసారు.

## తాడు బందు హనుమాన్ దేవాలయంలో ఘనంగా అన్న కూట మహోత్సవం, దివ్య జ్యోతి సందర్శనం

**హైదరాబాద్ పెన్ పవర్:** స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్సికింద్రాబాద్ తాడు బందు హనుమాన్ దేవాలయంలో అన్న కూట మహోత్సవం,దివ్య జ్యోతి సందర్శన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు పాల్గొని స్వామి వారినిదర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్ధించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించి వేదపండితులచే ఆశీర్వచనంఅందించారు.

# కంటైనర్ బోల్తా.... డ్రైవర్ కు గాయాలు

**సికింద్రాబాద్.. పెన్ పవర్:** బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బస్ స్టాప్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పంజాగుట్ట నుండి సికింద్రాబాద్ వైపుకు ప్లాస్టిక్ లోడ్ తో వెళ్తున్న కంటైనర్ బోల్తా కొట్టింది.. తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పంజాగుట్ట ఫ్లైఓవర్ నుండి వేగంగా దూసుకురావడంతో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సమీపంలోని బస్ స్టాప్ వద్ద అదుపుతప్పి ఎదురుగా ఉన్న థార్ వాహనాన్ని డీ కొట్టింది. ఈ ఘటనలో థార్ వాహనం నుజ్జునుజ్జయింది. కంటైనర్ డ్రైవర్ సంజయ్ స్వల్ప గాయాలతో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కంటైనర్ వాహనం బోల్తాపడడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో పోలీసులు తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తుప్రారంభించారు.

# ఆ నాలుగు ప్రాంతాలకు మహర్ధశ

**నిజామాబాద్, నవంబర్ 18,పెన్ పవర్:** : హైదరాబాద్: తెలంగాణలో రోడ్లకు మహర్ధశ పట్టనుంది. తెలంగాణలో ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చేపట్టాల్సిన 4 జాతీయ రహదారులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా ఆర్మూర్- జగిత్యాల, జగిత్యాల-కరీంనగర్, జగిత్యాల- మంచిర్యాల జాతీయ రహదారులకు సంబంధించి టెండర్లను ఆహ్వానించింది. అంతకుముందు మహబూబ్‌నగర్-గూడెబల్లూర్ హైవేకి సంబంధించిన టెండర్లను గత నెలలోనే ఆహ్వానించింది. ఈ నాలుగు రహదారులను ఎన్‌హెచ్ఏఐ మొత్తం 271 కి.మీ. మేర రూ. 10,034 కోట్లతో నిర్మించనుందని సమాచారం. ఈ డిసెంబరులో రోడ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ముగిసిన అనంతరం, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్ఏఐ చర్యలు చేపట్టనుంది. ఇందులో జగిత్యాల- మంచిర్యాల హైవేని ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో నిర్మించనున్నారు. మిగతా మూడింటిని హ్యామ్ విధానంలో వేయనున్నారు. ఈ నాలుగు రహదారులకు పర్యావరణ, అటవీ, రైల్వే అనుమతులు పూర్తయ్యాయి. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తే వెంటనే పనులు మొదలవుతాయి.

**జాతీయ రహదారుల వివరాలు..**

మహబూబ్‌నగర్- గూడెబల్లూర్ జాతీయ రహదారి: 80 కి.మీ. మేర రూ. 2,662 కోట్లతో జాతీయ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం 465.7 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది.

ఆర్మూర్- జగిత్యాల జాతీయ రహదారి: 64 కి.మీ. మేర రూ. 2,338 కోట్లతో నిర్మించనున్నారు. ఇందుకు 288.3 హెక్టార్ల భూమి సేకరించనున్నారు.

జగిత్యాల- కరీంనగర్: 59 కి.మీ. నేషనల్ హైవేను రూ. 2,484 కోట్లతో నిర్మిస్తారు. ఇందుకు 306.7 హెక్టార్ల భూసేకరణ చేయాలి.

జగిత్యాల- మంచిర్యాల రహదారి: 68 కి.మీ. నేషనల్ హైవేను రూ. 2,550 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. ఇందుకుగానూ 317 హెక్టార్ల భూమి సేకరించాలి.

6 లేన్లలో ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులు

ప్రాంతీయ వలయ రహదారి ఉత్తరభాగం పనుల సవరణ టెండర్లకు ఎన్‌హెచ్ఏఐ సిద్ధంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే దానిపై చర్యలు వేగవంతం చేయనుంది. గతంలో ఈపీసీ పద్ధతిలో ఈ పనుల కోసం టెండర్లు పిలవగా, ఈసారి హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం చేపట్టేలా టెండర్లు పిలుస్తారు. 2024 డిసెంబరులో సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు మొత్తం 161 కి.మీ. మేర 4 లేన్ల రహదారిని రూ. 7,104 కోట్లతో నిర్మించేందుకు టెండర్లు ఆహ్వానించింది. అయితే ట్రాఫిక్ సర్వే, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని దీనిని ఆరు వరుసలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించగా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఊపింది. మొత్తం రూ. 15,627 కోట్లతో ఆరు లేన్లుగా ఆర్ఆర్ ఉత్తర భాగం అభివృద్ధి చేయనున్నారు.

# ఇక గులాబీకి కొత్త నాయకత్వం



**హైదరాబాద్, నవంబర్ 18, పెన్ పవర్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో జరిగిన ఉప ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఊహించని ఓటమిని ఎదుర్కొంది.. ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి మొదలుపెడితే పోలింగ్ వరకు గులాబీ పార్టీ అన్ని శక్తులను ఉపయోగించింది. ప్రచారాన్ని కొత్త విధంగా కొనసాగించింది. విమర్శలు చేయడంలో.. ప్రభుత్వ విధానాలను ఎండబెట్టడంలో విభిన్నమైన ధోరణి ప్రదర్శించింది.. అయినప్పటికీ చివరి దశలో వెనుకంజ వేసి ఓటమిపాలైంది..కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం మొత్తం కూడా కాలికి బలపం కట్టుకుని తిరిగారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు ప్రచార పర్వంలో ముందుండి నడిచారు.. పోలింగ్ చివరి వరకు కూడా నిత్యం పర్యవేక్షించారు. తద్వారా చేయి జారిపోయిందనుకున్న జూబ్లీహిల్స్ స్థానాన్ని దక్కించుకున్నారు. వాస్తవానికి ఈ స్థానంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన ఓటు బ్యాంకు లేదు. 2009లో పిజెఆర్ కొడుకు విష్ణువర్ధన్ రెడ్డి గెలిచిన తర్వాత.. దాదాపు 16 సంవత్సరాల వరకు ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవలేదు.. అయితే ఇక్కడ ఈసారి మాత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ వినూత్నంగా ప్రచారం చేసి అద్భుతమైన గెలుపును సాధించుకున్నారు. తద్వారా ప్రభుత్వానికి ప్రజల్లో పరపతిని పెంచారు. రేవంత్ నాయకత్వం మీద ప్రజల్లో ఇంకా నమ్మకం ఉందని భరోసా కలిగించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఓటమి ఎదురైన నేపథ్యంలో గులాబీ పార్టీ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. కేటీఆర్ నాయకత్వం పై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూబ్లీహిల్స్ లో ఓడిపోయిన తర్వాత కేసీఆర్ కుమార్ కవిత ట్విట్టర్లో కర్మ హిట్స్ బ్యాక్ అని ఒక ట్వీట్ చేశారు. దీనిని బట్టి గులాబీ పార్టీలో.. కెసిఆర్ కుటుంబంలో ఎంతటి అంతర్గత కలహాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.. పార్టీ ఇలానే ఉంటే ఇబ్బంది తప్పదని భావించిన గులాబీ సుప్రీం కెసిఆర్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు మీడియాలో వార్తలు వస్తున్నాయి.. 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలుపెడితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వరకు గులాబీ పార్టీ వరుసగా కూటములు ఎదుర్కొంటూనే ఉంది. ఈ నేపథ్యంలో గులాబీ దళపతి రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. అందువల్లే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇబ్బంది ఎదురు కాకముందే.. పార్టీ పుట్టి మునగక ముందే.. సమూలంగా ప్రక్షాళన చేయాలని కెసిఆర్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు అడ్ హక్ కమిటీలతో పార్టీని నడిపించిన కేసీఆర్.. రాష్ట్ర స్థాయి వరకు కొత్త నాయకత్వాన్ని నియమిస్తారని తెలుస్తోంది. ఆ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పార్టీకి ఆదరణ అంతంతమాత్రంగానే ఉంది. అలాంటప్పుడు పరిస్థితి ఇలానే కొనసాగితే పార్టీ మనుగడ కష్టం అవుతుంది అని భావించిన కెసిఆర్.. ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రచారానికి కెసిఆర్ రావలసి ఉండేది. పార్టీ కార్యకర్తలు కూడా ఆయన ప్రచారం కోసం ఆసక్తిగా ఎదురు చూశారు. అయినప్పటికీ ఆయన దర్శన భాగ్యం కలగలేదు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో సునీతకు గెలిచే అవకాశం దక్కలేదు.

# లారీని ఢీ కొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

**హైదరాబాద్ పెన్ పవర్:** నందిగామ శివారు అనాసాగరం బైపాస్ వద్ద లారీని ఓవర్టేక్ చేసిన కావేరి ట్రావెల్స్ బస్సు ఆదే లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. హైదరాబాద్‌నుండి విజయవాడ వైపు కావేరి ట్రావెల్స్ బస్సు, లారీ వస్తున్నాయి. బస్సులో 20 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు.. వెంటనే క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వ హాస్పిటల్ కి హైవే మొబైల్ సిబ్బంది తరలించారు.

# ఆదాయం ఉన్నా.. అన్నీ సున్నానే

# అబ్కారీ శాఖ పనితీరు

**హైదరాబాద్, నవంబర్ 18, పెన్ పవర్:** వాణిజ్య పన్నుల శాఖ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టేశాఖ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ. 'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్న చందంగా శాఖను రకరకాల సమస్యలు వెంటాడుతున్నాయి. ఆ శాఖ ఉన్నతాధికారుల అలసత్వం, నిర్లక్ష్యం ఉద్యోగులు, సిబ్బందికి శాపం గా మారింది. శాఖ నుంచి లెక్కలేనంత ఆదాయం వస్తున్నప్పటికీ శాఖ పనితీరు, నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్రగ్స్, నార్కోటిక్స్ నిర్మూలన వంటి కీలక విధులుండేశాఖను సిబ్బంది కొరత వేధిస్తున్నది. ల్యాబ్‌ల్లో సుశిక్షితులైన టెక్నీషియన్లు లేక కేసుల పరిష్కారం ఆలస్య మవుతున్నది. 2017 నుంచి ఇప్పటివరకు సాధారణ బదిలీలు లేకపోవడం, 70 శాతం స్టేషన్లు అద్దె భవనాల్లో కొనసాగుతుండటం విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. సాధారణంగా ఏ ప్రభుత్వశాఖలోనైనా రెండేళ్లకోసారి బదిలీల ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, ఎక్సైజ్‌శాఖ మాత్రం ఎనిమిదేళ్ల నుంచి బదిలీల గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వశాఖల్లో ఎంత చిన్నశాఖలోనైనా బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ జరుగుతుంది. కానీ, ఎక్సైజ్ శాఖలో 2017 నుంచి ఎస్సై నుంచి ఆపై క్యాడర్లకు ఇప్పటివరకు సాధారణ బదిలీలు జరగలేదు. ఎనిమిది సంవత్సరాలుగా బదిలీల ప్రక్రియ పెండింగ్‌లోనే ఉంది. దీంతో ఎంతోమంది ఉద్యోగులు, అధికారులు ఒకేచోట తిష్ఠ వేసుకుని కూర్చున్నారు. ఈ పరిస్థితి అధికార వికేంద్రీకరణ, పాలనా పారదర్శకతకు ఆటంకం కలిగిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల ముందు తూతూమంత్రంగా కొన్ని బదిలీలు చేసినప్పటికీ, అవి పూర్తిస్థాయిలో జరగకపోవడం గమనార్హం. ఇప్పటికీ సిబ్బంది బదిలీలు, ఉద్యోగోన్నతులు విషయం ప్రశ్నార్థకంగానే ఉంది. ఎక్సైజ్‌శాఖ 2014 నుంచి ప్యానల్ ఇయర్‌ను రూపొందించకపోవ డం, సీనియారిటీ జాబితాను సిద్ధం చేయకపోవడం వల్ల ఉద్యోగులు సుదీర్ఘకాలం నుంచి ఒకే పోస్టింగ్‌లో ఎదుగూబొదుగూ లేకుండా ఉంటున్నారు. పదోన్నతుల కోసం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫైల్‌పై సంతకం సైతం చేశారు. అయినప్పటికీ, ఇప్పటివరకు ఆ దస్త్రం వెలుగు చూడలేదు. దానిపై ఎలాం టి కసరత్తు లేకపోవడంపై ఉద్యోగులు విస్మయం వక్త్యం చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏర్పాటైన కొత్త ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను పునర్వ్యవస్థీకరించి నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనాలు ఒనగూరలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖకు 139 స్టేషన్లు ఉండగా వీటిలో 70శాతం వరకు స్టేషన్లు అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే కొత్తగా నిర్మించాల్సిన 14 స్టేషన్ల సంగతి కూడా ఎటూ తేలడం లేదు. సొంత భవనాల గురించి ఉన్నతాధికారుల ప్రశ్నిస్తే దశాబ్దాల నుంచీ'ప్రభుత్వం సొంత భవనాలకు నిధులివ్వడం లేదు' అని చెప్తుండటం గమనార్హం. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య సిబ్బంది పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 22 ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టుల పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది. చెక్‌పోస్టుల్లో పనిచేసే సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వలేదు. ఆ చెక్‌పోస్టుల్లో వారికి మౌలిక సదుపాయాలు లేవు. కొన్నిచోట్ల గుడారాలు వేసుకు ని, మరికొన్ని చోట్ల కంటెయినర్లను కార్యాలయాలుగా

మార్చుకుని విధులు నిర్వహిం చాల్సిన దుస్థితి నెలకొంది. డగ్స్, నార్కోటిక్స్, నకిలీ మద్యానికి సంబంధించి కేసులను ఎక్సైజ్‌శాఖ సత్వరం పరిష్కరించాలంటే రాష్ట్రవ్యాప్తంగా పదుల సంఖ్యలో ల్యాబ్‌లు ఉండాలి. కానీ, ఆ శాఖకు రాష్ట్రవ్యాప్తంగా కేవలం మూడంటే మూడే ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. అవి కూడా అప్‌డేట్ అయినవి, అత్యాధునిక యంత్రపరికరాలతో ఉన్నవి కాకపోవడంతో కేసుల పరిష్కారం మరింత ఆలస్యమవుతున్నది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ల్యాబ్‌లు ద్వారా కేవలం గుడుంబా కేసులకు సరిపోతాయని, గంజాయి, మెఫెడ్రోన్, హాషిష్ ఆయిల్, ఎండీఎంఏ, కొకైన్, ఎల్ఎస్‌డీ, హెరాయిన్ వంటి పరీక్షలకు పెద్దగా ఉపయోగపడవని సొంతశాఖ సిబ్బందే వాపోతుండటం గమనార్హం. అలాగే ఆయా ల్యాబ్‌ల్లో సుశిక్షితులైన సిబ్బంది లేరనేది వాస్తవం. ఎక్సైజ్‌శాఖ ముఖ్యమైన కేసులు ఉన్నప్పుడు పోలీస్ శాఖకు చెందిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ (ఎఫ్ఎస్ఎల్)పైనా ఆధారపడాల్సి వస్తుంది. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం తక్షణం స్పందించి ఎక్సైజ్ శాఖపై దృష్టి సారించాలని ఆశాఖ సిబ్బంది కోరుతున్నారు. ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని, ప్రతిచోట సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతులు, సీసీఐ మధ్య ప్రతిష్టంబన నిలిచిన పత్తి కొనుగోళ్లు

**అదిలాబాద్, నవంబర్ 18, పెన్ పవర్:**

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిబంధనలను నిరసిస్తూ సోమవారం నుంచి జిన్నింగ్ మిల్లులు బంద్‌ను పాటిస్తున్నాయి. బంద్ మొదటి రోజు సంపూర్ణంగా ముగిసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీసీఐతో పాటు ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా అమలు చేస్తున్న నిబంధనలను జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పత్తిని సీసీఐ కొనుగోలు చేసిన ప్పటికి.. దూది నుంచి గింజలను వేరు చేసి బేళ్లుగా మార్చేందుకు ప్రయివేటు జిన్నింగ్ మిల్లులను లీజుకు తీసుకుంటుంది. కొనుగోలు చేసిన పత్తి కేటాయింపులో గతంలో ఎలాంటి నిబంధనలు ఉండేవి కావు. ఆయా జిన్నింగుల సామర్థ్యం మేర పత్తిని కేటాయించేవారు. అయితే ఈ ఏడాది సీసీఐ ఎల్-1, ఎల్-2, ఎల్-3 అనే మూడు విభాగాలుగా జిన్నింగులను విభజించింది. నాణ్యతా ప్రమాణాల ఆధారంగా జిన్నింగులను విభజించి పత్తిని కేటాయిస్తున్నారు. ఈ విధానాన్ని జిన్నింగ్ వ్యాపారులు వ్యతిరేకిస్తూ.. మార్కెట్ ప్రారంభంలోనే బంద్ కు సిద్దమవగా.. ప్రభుత్వం జిన్నింగ్ మిల్లుల యాజ మాన్యాలతో పలు మార్లు చర్చలు జరిపి.. సడలింపుకు హామి ఇచ్చింది. దీనికి సంబంధించి ఇంత వరకు ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో సోమవారం నుంచి బంద్ కు నిర్ణయించాయి. ఒక వైపు తేమ శాతం ఎక్కువగా ఉందని ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తినే సీసీఐ కొనుగోలు చేస్తుండటం, మరో వైపు జన్నింగ్ మిల్లులు బంద్‌కు పిలుపు ఇవ్వడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో పత్తి రైతులు సీసీఐ స్థానిక కార్యాలయాల ముం దు ఆందోళనలు నిర్వహించారు. రాష్ట్రంలో 325 జిన్నింగ్ మిల్లులు ఉండగా 242 మిల్లులు మాత్రమే రైతులకు కేటాయించారు. ఇంకా 82 మిల్లులు తెరవకపోవ డంతో ఈ ప్రాంతాల్లోని పత్తి రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి పత్తిని అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో పత్తి రైతులపై రవాణా చార్జీలు భారం పడుతుంది. ఇలాంటి సమయంలో జిన్నింగ్ మిల్లులు బంద్ చేపట్టడం వల్ల రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు.

**ఆదిలాబాద్ జిల్లాలో..**

ఆదిలాబాద్‌లోని సీసీఐ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. తేమ శాతం నిబంధన లేకుండా పత్తి సోయా కొనుగోలు చేయాలంటూ ఆందోళనకు దిగారు. మరోవైపు సీసీఐ సంస్థ నిబంధనల కారణంగా ప్రైవేట్ జిన్నింగ్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు పత్తి కొనుగోలు నిలిపివేస్తూ నిర్ణయం తీసుకోవడంతో, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిలిచిపో యాయి. జిల్లా వ్యాప్తంగా 34 జిన్నింగులు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నాయి. రైతులకు ఈ విషయాన్ని ముందుగానే తెలియ జేయడంతో వారు కూడా మార్కెట్ కు పత్తి తీసుకురాలేదు. పత్తి కొనుగోళ్లలో సీసీఐ కొత్త నిబంధనలతో రైతులతో పాటు ట్రేడర్స్ కూడా నష్టపోతారని జిన్నింగ్ మిల్లుల యాజమన్యాల అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్ కుమార్

చింతవార్ అన్నారు. అన్ని మిల్లులకు కిసాన్ యాప్ లో కేటాగిరిలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కేంద్ర జౌళి శాఖ అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. జిన్నింగ్ మిల్లులు బంద్ చేపట్టడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

పత్తికి సంబంధించిన 12 శాతం తేమ, ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తినే కొనుగోలు పరిమితిపై మరోసారి సమీక్ష చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. రైతులు రేయింబవళ్లు కష్టపడి సాగు చేసిన పంటలు , వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, తుపాన్‌లాంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇలాంటి సమయంలో సీసీఐ పెట్టిన నిబంధనలతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారుఇక పెసళ్లు, కందులు, పొద్దుతిరుగుడు వంటి పంటలపై 25 శాతం వరకే కొనుగోలు పరిమితి విధించడంతో.. మిగతా పంటను ప్రయివేట్‌కు అమ్ముకోవాల్సి వస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. సోయాబిన్ రంగు మారిందని కొనుగోలు చేయడం లేదన్నారు. జిన్నింగ్ మిల్లులు చేపట్టిన బంద్‌ను విరమించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# అర్థం కానీ కవిత వ్యూహం...



**హైదరాబాద్, నవంబర్ 18 పెన్ పవర్:**

అవే ప్రశ్నలు.. వేదిక మాత్రమే మారుతుంది.. కవిత సంధించే తీరు మాత్రం మారడం లేదు.. ప్రతి విషయంలో కూడా ఆమె గులాబీ పార్టీ తప్పులను వేలెత్తి చూపిస్తోంది.. ప్రాజెక్టుల నుంచి మొదలుపెడితే రోడ్ల వరకు ప్రతి విషయంలోనూ ఆమె స్పష్టంగా మాట్లాడగలుగుతుంది. జూబ్లీహిల్స్ ఓటమి తర్వాత కవిత మరింత ఘాటుగా స్పందిస్తోంది. గులాబీ పార్టీ మీద విమర్శలు చేస్తోంది. వాస్తవానికి ఈ విమర్శలకు సమాధానం చెప్పాల్సిన స్థితి నుంచి గులాబీ పార్టీ నేతలు కవితను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు.. ఓ గులాబీ పార్టీ నాయకుడు అయితే ఏకంగా కవితను రాక్షసి అని సంబోధించాడు.. వాస్తవానికి కేసీఆర్ బతికి ఉండగానే కెసిఆర్ కుమార్తెను సొంత పార్టీ వాళ్లు తిడుతుండడం.. ఇంతకంటే దారుణం మరొక నాయకుడికి ఉండదు. కవిత పదేపదే హరీష్ రావును లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తోంది.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీ ఓడిపోవడం కంటే పెద్ద అభిమానం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఉండదని కవిత ఆరోపించింది.. హరీష్ రావును మోసగాడు అని చెబుతున్న కవిత.. అతడు రేవంత్ రెడ్డికి టచ్ లో ఉన్నాడని ఆరోపిస్తోంది.. పార్టీలో ఉంటూ పార్టీని నిండా ముంచేస్తున్నాడని విమర్శిస్తోంది.. అంతేకాదు కేటీఆర్, హరీష్ రావు తమ భుజాల మీద గులాబీ పార్టీని మోస్తున్నట్టు.. కెసిఆర్ ను కాపాడుకుంటున్నట్టు బిల్డప్ ఇస్తున్నారని.. కానీ కెసిఆర్ ముందు తూగలేరనే విషయాన్ని వారిద్దరు మర్చిపోతున్నారని కవిత ఆరోపించారు.. కృష్ణార్జునల మని ఇద్దరు చెప్పుకుంటున్నారు.. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని.. ఒకరి మీద మరొకరు బాణాలు వేసుకుంటున్నారని.. ఫలితంగా క్యాడర్ మొత్తాన్ని నాశనం చేస్తున్నారని కవిత ఆరోపిస్తున్నారుగులాబీ పార్టీ బలం మొత్తం సోషల్ మీడియాలో మాత్రమే కనిపిస్తోందని.. క్షేత్రస్థాయిలో అంత సన్నివేశం లేదని కవిత మండిపడుతున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల హరీష్ రావు, గంగుల కమలాకర్, నవీన్ రావ్ కు భూములు ఉన్నాయని.. వాటిని కాపాడుకోవడం కోసం రోడ్డు అలైన్మెంట్ మార్చేశారని కవిత ఆరోపించారు. అంతేకాదు రీజినల్ రింగ్ రోడ్ వల్ల రెడ్డిపల్లి గ్రామంలో సుమారు 56 మంది రైతులు తమ 59 ఎకరాల భూములను కోల్పోయారని.. ఈ విషయాలు కేసీఆర్ కు తెలియకుండా హరీష్, ఇతర నేతలు చూశారని.. అందువల్ల మెదక్ జిల్లాలో గులాబీ పార్టీ దారుణంగా ఓడిపోయిందని కవిత సంచలన ఆరోపణలు చేశారు. కవిత ఇంటిపేరు కల్వకుంట్ల కాబట్టి.. కెసిఆర్ కుమార్తె కాబట్టి ఆమె చేస్తున్న ఆరోపణలన్నీ కూడా తెలంగాణ వ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. వాస్తవానికి ఆమె మాట్లాడుతున్న మాటలు సంచలనంగా ఉన్నాయి. ఇప్పటికే చాలామంది బాధితులు కవితని కాలుస్తున్నారు.. కవిత చేస్తున్న ఆరోపణలపై గులాబీ పార్టీ నాయకులు కేవలం వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకొని కౌంటర్ ఇస్తున్నారు. అంతేతప్ప కవిత చేసిన విమర్శలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. కవిత గులాబీ పార్టీ చేసిన తప్పులను మొత్తం బయటపెడుతున్న నేపథ్యంలో కేడర్ మొత్తం అయోమయంలో ఉంది. తీవ్ర నిరాశ నిస్పృహల మధ్య వారంతా కూడా తనవైపు వస్తున్నారని కవిత చెబుతున్నారు.. కవిత చేస్తున్న ఆరోపణలు గులాబీ పార్టీలో ఉన్న అసలు బాగోతాన్ని బయటపెడుతున్నాయి. వీటికి కౌంటర్ కాదు కదా కనీసం సరైన స్థాయిలో సమాధానం ఇచ్చే స్థితిలో కూడా గులాబీ పార్టీ లేకపోవడం అత్యంత బాధాకరం.

# పరాకాష్టకు చేరిన ప్రతీకారం...

**న్యూఢిల్లీ నవంబర్ 18, పెన్ పవర్:**మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా కు బంగ్లాదేశ్ కోర్టు మరణశిక్ష విధించింది. అక్కడ జరిగిన అల్లర్లకు హసీనా ప్రధాన కారణమని భావిస్తూ కోర్టు ఈ శిక్ష విధించింది. అంతేకాదు భారతదేశంలో తలదాచుకున్న ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం కోరింది. సోమవారం జరిగిన ఈ పరిణామాలు ఒక్కసారిగా చర్చకు దారి తీసాయి. వాస్తవానికి గత ఆగస్టు నుంచి హసీనా మన దేశంలో ఉంటున్నారు.. ఇంగ్లాండ్ దేశానికి శరణార్థిగా వెళ్లడానికి ఆమె దరఖాస్తు చేసుకున్నారు. అయినప్పటికీ అక్కడి ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. దీంతో ఆమె భారత దేశంలోనే ఉండిపోవాల్సి వస్తోంది.ప్రస్తుతం బంగ్లాదేశ్ లో విపరీతంగా అల్లర్లు చోటుచేసుకుంటున్నాయి. తాత్కాలిక యూనస్ ప్రభుత్వం మీద అక్కడి ప్రజలతో నమ్మకం పోయింది.. అక్కడి పోలీసులకు విస్తృతమైన అధికారాలు ఇవ్వడం ప్రజలకు నచ్చడం లేదు. దీనికి తోడు అవినీతి పెరిగిపోయింది.. అంతర్జాతీయ నోబెల్ బహుమతి సాధించిన యూనస్ పరిపాలన విషయంలో ఆ స్థాయిలో పట్టు సాధించలేకపోతున్నారు. దీంతో ప్రజలకు ఉన్న ఆశలు అడియాసలు అవుతున్నాయి. అక్కడి ప్రజలు వీధులలోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారు. పాలనలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి యూనస్ ప్రభుత్వం చేయని పని అంటూ లేదు. అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారిపోయిన బంగ్లాదేశ్.. పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా అమెరికాకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అయితే ఇది అక్కడి ప్రజలకు ఏమాత్రం నచ్చడం లేదు. దీంతో హసీనా ప్రస్తావన మళ్ళీ అక్కడ వస్తోంది. ఆమె ఎక్కడ జనాల్లో సానుభూతి పెంచుకుంటారేమోనని.. ప్రజలకు ఆమె వైపు దృష్టి మరలుతుందోనని భావించి.. యునస్ ప్రభుత్వం హసీనాకు వ్యతిరేకంగా అభియోగాలను మోపిందని.. కోర్టులో ప్రభుత్వం తరపున బలంగా వాదించిందని.. దీంతో కోర్టు కూడా ఆమెకు మరణశిక్ష విధించిందని అంతర్జాతీయ మీడియా ద్వారా తెలుస్తోంది.హసీనా మన దేశంలో ఉండడం బంగ్లాదేశ్ ప్రభుత్వానికి ఏమాత్రం నచ్చడం లేదు. పైగా ఇప్పుడు బంగ్లాదేశ్ అమెరికా కు అనుకూలంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో కొంతకాలంగా భారత్ అమెరికాకు దూరంగా జరగడం మొదలుపెట్టింది. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న అక్కడి తాత్కాలిక ప్రభుత్వం అమెరికా మెప్పును మరింత పొందడానికి రకరకాలుగా ప్రయత్నాలు చేస్తోంది.. ఈ క్రమంలోనే హసీనా కు మరణశిక్ష విధించేలా అక్కడి ప్రభుత్వం పావులు కదిపినట్టు వార్తలు వస్తున్నాయి. హసీనాకు మరణశిక్ష విధించిన తర్వాత ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం కోరింది. అయితే బంగ్లాదేశ్ విన్నపాన్ని భారత్ తిరస్కరించింది. బంగ్లాదేశ్లో ప్రజాస్వామ్యం, శాంతి, సామరస్యం ఏర్పాటుకు తాము కృషి చేస్తామని.. హసీనాను అప్పగించే విషయంలో తాము తొందరపాటు నిర్ణయం తీసుకోబోమని భారత్ స్పష్టం చేసింది. మరోవైపు 1967లో హసీనాకు సరిగా నవంబర్ 17న వివాహం జరిగింది. అదేరోజు బంగ్లాదేశ్ కోర్టు ఆమెకు మరణశిక్ష విధించడం విశేషం. అయితే ఇందులో కుట్ర కోణం ఉందని.. కావాలని ఇలా చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



# కలలో కనిపించిన శ్రీనివాసరావు నీలోఫర్ బాబురావు అమలు చేశాడు

**హైదరాబాద్, నవంబర్ 18, పెన్ పవర్:**
హైదరాబాద్ లో చార్మినార్, హైటెక్ సిటీ, బుద్ధుడి విగ్రహం, రామోజీ ఫిలిం సిటీ .. ఇవన్నీ కూడా ఐకానిక్ సింబల్స్. ఇంకా వీటి జాబితా పెరుగుతూనే ఉంది. అయితే తొలిసారిగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ లో ఓ సామాన్యుడు చేసిన అద్భుతం చేరింది. అది కాస్త దేశ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఆ అద్భుతాన్ని ఆవిష్కరించిన వ్యక్తి పేరు బాబురావు. హైదరాబాద్ నగరంలో ముఖ్యంగా ఐటీ పరిశ్రమలు అధికంగా ఉండే ప్రాంతంలో కొన్ని నెలల క్రితం నీలోఫర్ కేఫ్ ఏర్పాటయింది. ఇందులో లభించే టీ, మస్కా బన్ అత్యంత ముఖ్యమైనవి. కేవలం ఇవి మాత్రమే కాకుండా.. ఇంకా చాలా ఉత్పత్తులను నిలోఫర్ కేఫ్ లో విక్రయించడం మొదలుపెట్టారు. ఇక్కడ విక్రయించే టీ ధర కూడా ?1000 దాకా ఉంటుంది. అదే కాదు నిలోఫర్ కేఫ్ ఏర్పాటుచేసిన భవనం అద్దె కూడా లక్షల్లో ఉంటుంది. ఈ అద్దె చెల్లింపుకు సంబంధించిన వార్త కూడా అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇలా చెప్పుకుంటూ పోతే నిలోఫర్ కేఫ్ గురించి రాయడానికి చాలా ఉంది.నిలోఫర్ కేఫ్ ను బాబురావు ప్రారంభించారు.. ఈయన ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చారు. ఒక బట్టల షాపులో పనిచేసే.. ఆ తర్వాత హోటల్ పెట్టారు. క్రమక్రమంగా ఎదిగారు. హైదరాబాదులో ఐకానిక్ సింబల్స్ జాబితాలో తన నిలోఫర్ కేఫ్ కూడా ఉండడం బాబురావు సాధించిన విజయానికి ఒక ప్రతీక. అటువంటి బాబురావు ఇప్పుడు మళ్లీ వార్తలలో నిలిచారు. అలాగని ఈసారి ఆయన కొత్త కేఫ్ ఏర్పాటు చేయలేదు. హోటల్ కూడా నిర్మించలేదు.. ఈసారి ఆయన ఆధ్యాత్మిక కోణంలో వార్తల్లోకి ఎక్కారు. ఎక్కడం మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా తన గురించి చర్చ జరిగేలా చూసుకున్నారు.బాబురావు వెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడు.. ఇటీవల బాబు రావుకు ఓ కల వచ్చింది. అందులో వెంకటేశ్వర స్వామి ఆయనకు కనిపించారు. తనకోసం ఒక యజ్ఞోపవీతం తయారు చేయించాలని స్వామివారు బాబురావును కోరారు. దీంతో బాబురావు వెంటనే యజ్ఞోపవీతం తయారు చేయించారు. దీనికోసం మేలిమి బంగారు, వజ్రాలను ఉపయోగించారు. నాలుగున్నర కోట్లు ఖర్చుపెట్టి దీనిని తయారు చేయించారు. దీనిని తయారు చేయడానికి దాదాపు నెల రోజుల వరకు సమయం పట్టింది. గత నెలలో కుటుంబంతో కలిసి బాబురావు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. ఆ తర్వాత ఆయనకు కలలో స్వామి వారు వచ్చి ఇలా యజ్ఞోపవీతం అడిగినట్టు అనిపించింది. అందుకే నాలుగున్నర కోట్లు ఖర్చుపెట్టి వెంకటేశ్వర స్వామికి బాబురావు యజ్ఞోపవీతం తయారు చేయించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే కాకుండా.. సేవ విషయంలోనూ బాబురావు ముందుంటారు. తన కేఫ్ లో తయారు చేసే ఉత్పత్తులను పేద పిల్లలకు అందిస్తుంటారు. వారి చదువుకు కూడా సహాయం చేస్తుంటారు. బాబురావు ఆర్థిక సహాయం చేసిన చాలా మంది పిల్లలు జీవితంలో స్థిరపడ్డారు. ఇప్పటికీ తన సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది పిల్లల చదువులకు బాబురావు ఆర్థికంగా సహాయం చేస్తూనే ఉంటారు. భవిష్యత్తు కాలంలో ఒక స్కూలును ఏర్పాటు చేయాలని బాబురావు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# రాజకీయాలకు అక్బరుద్దీన్ గుడ్ బై

**హైదరాబాద్, నవంబర్ 18, పెన్ పవర్:**
ఎంఐఎం శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ రాజకీయాల నుంచి విరమించుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన బలమైన సంకేతాలు ఇచ్చారు. అయితే ఆయన తన రాజకీయ వారసత్వాన్ని కుమారుడు నూరుద్దీన్ కు అప్పగించాలని దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు కనపడుతుంది. ఇటీవల ఆయన ఒక కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఆరోగ్య కారణాల రీత్యానే రాజకీయాల నుంచి ఆయన తప్పుకుని పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఆయన తన కుమారుడు నురద్దీన్ ఒవైసీని తన వెంట తిప్పుకుంటున్నారు. అతనికే రాజకీయ వారసత్వ బాధ్యతలను అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో చాంద్రాయణ గుట్ట నుంచి నురుద్దీన్ ఒవైసీని పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే స్థానానికి ఆయన బ్యాకప్ నామినీగా ఉన్నాడు.అక్బరుద్దీన్ చాంద్రాయణగుట్ట శాసనసభ నియోజకవర్గం నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు మంచి నాయకుడిగా పేరుంది. అసెంబ్లీలో, బయట ఆయన ప్రసంగాలకు పిచ్చి



ఫ్యాన్స్ ఉన్నారు. అయితే 2011లో అక్బరుద్దీన్ ఒవైసీపై జరిగిన దాడి తర్వాత ఆయనకు తరచూ ఆరోగ్యకరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శరీరంలో ఉన్నబుల్లెట్ అలాగే ఉంది. దీంతో ఆయన తరచూ ఆసుపత్రులకు వెళ్లి ఆరోగ్య పరీక్షలతోపాటు చికిత్స చేయించుకోవాల్సి వస్తుంది. 2011 ఏప్రిల్ 30న బర్కాస్‌లో కత్తులు, తుపాకులతో దాడిచేసిన దుండగులు అక్బరుద్దీన్‌కు తీవ్ర గాయాలు చేశారు. కడుపు, చేతికి బుల్లెట్ గాయాలు అయ్యాయి. చాలావాటిని వైద్యులు తొలగించినా, ఒక బుల్లెట్ కీలక అవయవాల దగ్గర ఇరుక్కుపోవడంతో అలాగే ఉంచాల్సివచ్చింది. అప్పటి నుంచి ఆయనకు నిరంతర నొప్పి, ఆరోగ్య సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్నిసార్లు ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్బరుద్దీన్ ఒవైసీ విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. ఈ మేరకు క్యాడర్ తో పాటు పార్టీ నేతలకు కూడా బలమైన సంకేతాలు అందచేశారు. ఆయన కుమారుడు నురుద్దీన్ ఒవైసీకి రాజకీయ బాధ్యతలను అప్పగించనున్నారు.

# బీసీలను ఎన్నాళ్లు...చట్టబద్ధత సాధ్యమేనా

**హైదరాబాద్, నవంబర్ 18, పెన్ పవర్:**
బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్తామని గతంలో చాలెంజ్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అవి సాధ్యం కాకపోవడంతో ఎలా ముందుకెళ్లాలా అన్నదానిపై కిందా మీదా పడుతోంది. సాధ్యం కావడం లేదు అని ప్రజలు చెప్పడానికి మొహమాట పడుతోంది. అలాగే మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. తెలంగాణలో బ్యాక్‌వర్డ్ క్లాసెస్లకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేసిన కాంగ్రెస్ హామీ, ఇప్పుడు తీవ్ర వివాదాస్పదమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హామీని "కామారెడ్డి డిక్లరేషన్"గా ప్రకటించి, %దీజ%ల ఓటు బ్యాంకును సృష్టించుకుంది. కానీ, తాజా హైకోర్టు స్టే, సుప్రీంకోర్టు తిరస్కారాలు, ఆర్థిక-చట్టపరమైన సమస్యల మధ్య, "ఇది సాధ్యమే కాదని " క్లారిటీ వస్తోంది. తెలంగాణలో %దీజ%లు 56 శాతం జనాభా ఉన్నారు. కులగణనలో ఇది తేల్చారు. కానీ 29 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఇవి ఉద్యోగ, విద్య అవకాశాల్లో. రాజకీయంగా అయితే స్థానిక ఎన్నికల్లో 25 శాతం రిజర్వేషన్ మాత్రమే ఉంది. కాంగ్రెస్ 'కామారెడ్డి %దీజ% డిక్లరేషన్'లో %దీజ%లకు 42% రిజర్వేషన్లు, కులగణన చేస్తామని ప్రకటించారు. కులగణన చేశారు. హౌస్-టు-హౌస్ డేటా కలెక్షన్ చేశారు. %దీజ%లు 56.33% అని రిపోర్ట్ వచ్చింది. ఈ డేటా ఆధారంగా అసెంబ్లీలో రెండు బిల్లులు పాస్ చేశారు. విద్య, ఉద్యోగ లోకల్ బాడీల్లో 42% %దీజ% కోటా కల్పించారు. కానీ సుప్రీంకోర్టు పెట్టిన 50% కోటాను దాటిపోతుంది. బిల్లులు ఆమోదించాలని ఆగస్టులో రేవంత్ ఢిల్లీలో ధర్నా కూడా చేశారు. చివరికి జీవో ఇచ్చారు.. జీవోపై హైకోర్టు స్టే ఇచ్చింది. ప్రభుత్వం సుప్రీంకోర్టులో %ూశా% ఫైల్ చేసింది. ఆ ఎస్ఎల్పీని సుప్రీంకోర్టు కొట్టి ఢిల్లీలో ధర్నా చేసినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ ను ప్రధానిని చేసుకుని బిల్లును ఆమోదించుకుంటామని ప్రకటించారు. అంటే ఆయనకు ఇప్పుడల్లా లీగల్ గా రిజర్వేషన్లు రావని క్లారిటీ ఉన్నట్లే. అయితే బిల్లులు ఆమోదించడం లేదని కేంద్రాన్ని నిందిస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "42% కోటా సైంటిఫిక్, %దీజ%ల హక్కు. బీజేపీ కేంద్రం బిల్లులు పెండింగ్‌లో పెట్టి %దీజ%లను మోసం చేస్తోంది" అని ఆరోపిస్తున్నారు. కానీ న్యాయపరంగా ఊరట లభించలేదు. ప్రభుత్వం సుప్రీంకోర్టులో %ూశా% ఫైల్ చేసింది, కానీ %ాజ% "హైకోర్టు స్టే సరైనది" అని తిరస్కరించింది. సుప్రీం కోర్టు 1992 ఇంద్రా సాహ్ని జడ్జ్‌మెంట్ ప్రకారం 50% రిజర్వేషన్ క్యాప్ పెట్టింది. కానీ తమిళనాడు 69 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి.

# కారావాన్ టూరిజానికి రెడి

**విశాఖపట్టణం, నవంబర్ 18, పెన్ పవర్:** రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా కారవాన్ టూరిజం ప్రోత్సహిస్తోంది. అల్లూరి జిల్లాలో కారవాన్ టూరిజం, కారవాన్ పార్కులు ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలోనే ట్రయల్ రన్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి ఆదివారం లంబసింగికి కారవాన్ వాహనం చేరుకుంది. కారవాన్ ట్రయల్ రన్ సక్సెస్ అయితే భవిష్యత్తులో లంబసింగి, తాజంగిలో వీటిని ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధి కోసం సరికొత్త ప్రణాళికలు రచిస్తోంది. హోంస్టేలు, కారవాన్లు వంటి వినూత్న విధానాల ద్వారా సందర్శకులను కట్టిపడేయాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే హోంస్టేలు, కారవాన్ టూరిజాన్ని అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా అల్లూరి జిల్లాలో కారవాన్ టూరిజం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు . హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ కారవాన్ ఆదివారం లంబసింగి చేరుకుంది. ఈ కారవాన్ వాహనంలో మూడు కుటుంబాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. అన్ని సౌకర్యాలు కల్పించారు. ట్రయల్ రన్‌లో భాగంగా కారవాన్ వాహనాన్ని హరిత రిసార్టు అధికారులు పరిశీలించారు. అలాగే అల్లూరి జిల్లాలో కారవాన్ టూరిజానికి ఉన్న అవకాశాలు, ప్రదేశాలు, వనరులను కారవాన్ నిర్వాహకులకు వివరించారు. ఈ ట్రయల్ రన్ విజయవంతమైతే.. వచ్చే రోజుల్లో ఇలాంటి వాహనాలను లంబసింగి, తాజంగిలోనూ అందుబాటులోకి తేనున్నారు.మరోవైపు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో కారవాన్ టూరిజ ప్రాజెక్టులు అమలుచేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతాల్లో అవసరమైన ప్రదేశాలను కూడా ఇప్పటికే ఎంపిక చేశారు. రెవెన్యూశాఖ కూడా అవసరమైన స్థలాలను గుర్తించారు. మరోవైపు కారవాన్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రైవేట్ ఆపరేటర్లకు ప్రోత్సాహకాలు కూడా అందించనుంది. 2029 నాటికి ఏపీలో 150 కారవాన్ వాహనాలు, 25 వరకూ కారవాన్ పార్కులు ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా కారవాన్ పాలసీని కూడా తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఏపీలో రిజిస్ట్రేషన్ చేసుకునేకారవాన్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్ మినహాయింపుకూడా ఇవ్వనున్నారు.రిజిస్ట్రేషన్ చేసుకున్న మొదటి 25 వాహనాలకు వంద శాతం లైఫ్‌టాక్స్ మినహాయింపు ఉంటుంది. మూడు లక్షల రూపాయల వరకూ లైఫ్ ట్యాక్స్ మినహాయిస్తారు ఆ తర్వాత 13 వాహనాలకు 50 శాతం.. అనంతరం రిజిస్ట్రేషన్ చేసుకునే 12 వాహనాలకు 25 శాతం లైఫ్ టాక్స్ మినహాయింపు ఉంటుంది. అలాగే ఏడేళ్లపాటు రాష్ట్ర జీఎస్టీ వెనక్కి చెల్లిస్తారు.మరోవైపు కారవాన్ పార్కుల అభివృద్ధి కోసం పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన స్థలాలను కూడా కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కారవాన్ వాహనాలను పార్కింగ్ చేసుకోవటంతో పాటుగా వసతి, భోజన సదుపాయాన్ని కారవాన్ పార్కులలో ఏర్పాటు చేయనున్నారు. రవాణా సౌకర్యం లేని మారుమూలల్లో ఉన్న ప్రకృతి అందాలను కూడా ఆస్వాదించేలా పర్యాటకుల కోసం ఈ కారవాన్ టూరిజం ఆలోచన చేశారు.

# వారణాసి మూవీ చిన్న మస్తాదేవి... దశమహావిద్యలలో ప్రస్తావన

**హైదరాబాద్, నవంబర్ 18, పెన్ పవర్:** దర్శక ధీరుడు రాజమౌళి సూపర్ స్టార్ మహేష్ బాబు కలయిక లో వస్తున్న వారణాసి సినిమా పై అంచనాలు స్కై లెవెల్ లో ఉన్నాయి. ఇటీవల ఆ సినిమా టైటిల్ అనౌన్స్ మెంట్ సందర్భంగా చూపించిన విజువల్ లో ఒక దేవత విగ్రహం ఇప్పుడు వైరల్ అవుతోంది. చాలామంది ఆ దేవతను కాళీ మాత అనుకుంటున్నారు కానీ అది నిజం కాదు. ఆమె పేరు 'చినమస్తాదేవి'. చాలా ప్రాచీన గ్రంథాల్లో నిక్షిప్తమై ఉన్న ఆ దేవత తనలో చాలా రహస్యాలు దాచుకుంది.
భయంకరమైన యోగినీ రూపం.. 'చినమస్తాదేవి 'చిన మస్త' అనే మాటకు అర్థం 'శిరస్సు తెగిన స్త్రీ 'అని అర్థం. ఆమెను రకరకాల గ్రంథాల్లో రకరకాల పేర్లతో పిలిచారు. చిన మస్త, చిన్న మస్తా, ప్రచండ చండిక, జోగని మా లాంటి పేర్లు ఆమెకు ఉన్నాయి. సాధారణంగా నగ్నంగా ఉన్న స్త్రీ మూర్తి తన తలను తానే నరుక్కుని ఆ తలను ఒక చేత్తో పట్టుకుని ఉన్నట్టు ఆమె రూపం ఉంటుంది. మరో చేతిలో రక్తం ఓడుతున్న కత్తి ఉండగా ఆమె మెడలో పుర్రెలతో వేలాడుతున్న దండ, నాగుపాము ఉంటాయి. ఆమె కంఠం నుంచి మూడు రక్తపు ధారలు పైకి చిమ్ముతూ ఉండగా రెండు ధారలను నగ్నం గా ఉన్న ఇద్దరు స్త్రీలు తాగుతుండగా మూడో రక్తపు ధారను ఆ స్త్రీ దేవత తెగిన శిరస్సు స్వయంగా తాగుతుంటుంది. ఆమె కాళ్ల దగ్గర ఒక స్త్రీ పురుషుడు సృష్టి కార్యం లో మునిగిఉంటారు. చూడగానే గగ్గుర్పాటు కలిగించే అ దేవత నే 'చిన మస్త దేవి.'టిబెటెన్ తాంత్రిక ఆరాధనల్లో చిన్న మస్త దేవి పూజ ఉంటుంది ఆమెనుఅక్కడ త్రికాయ యోగిని అని పిలుస్తారు..అలాగే పురాతన వైదిక గ్రంథాల్లో ఆమెను జీవాన్ని ఇచ్చే దేవతగా అలాగే జీవాన్ని తీసేసే దేవతగా వర్ణించారు. వైదిక గ్రంథాల్లో ఆమెను కుండలినే శక్తి ని ఉత్తేజ పరిచే దేవత అని చెప్పారు. విధ్వంసం, శృంగారం, త్యాగం లాంటి గుణాలకు ఆమె ప్రతీక అని చెప్పారు. యోగ ప్రక్రియల్లో ఆమెను కుండలినీ శక్తి ఉత్తేజ పరిచడం కోసం ధ్యానిస్తారని చెప్పబడింది. కొన్ని గ్రంథాల్లో శైవమతం లో ఆమె గురించిన ప్రస్తావన ఉంది. హిందూ పురాణాల్లో చిన్న మస్త ప్రస్తావన తొలిసారిగా 9వ శతాబ్దం నాటి" శక్త మహా భాగవత పురాణ ", 9వ శతాబ్దం నాటి దేవి భ గవత పురాణాల్లో ఉంది.తాంత్రిక బౌద్ధ గ్రంథాల్లో కనిపించే చిన్న ముండిక, హిందూ పురాణాల్లో కనిపించే చిన్న మస్త దేవి ఇద్దరూ ఒకరేనని 20వ శతాబ్దపు ప్రముఖ రీసెర్చర్ ఓరియంటల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బరోడా డైరెక్టర్ బినయ్ తోష్ బట్టాచార్య తెలిపారు.హిందూ ఆరాధన విధానాల్లో ఒకటైన తాంత్రిక పూజల్లో ఆరాధించే రౌద్ర రూప దేవతలను 'మహా విద్య' లు అంటారు. ఆ దేవతల్లో చిన మస్తా కూడా ఉంది.19 వ శతాబ్దం నాటి 'ప్రాణ తోషిణి తంత్ర" ప్రకారం ఒకసారి పార్వతి దేవి మరో అవతారం చిన మస్తా దేవి మందాకిని నదిలో స్నానం చేసి వస్తుండగా ఆమె చెలికత్తె లైన డాకిని,వామిని (వీరినే జయ, విజయ అని కూడా అంటారు) ఆకలి అంటూ అరవడం తో వారికోసం చినమస్తాదేవి తన తలను తానే నరుక్కొని తన రక్తాన్ని వారికి ఆహారంగా ఇచ్చి ఆకలి తీర్చింది. మరో రక్తపు ధార నేలపై పడితే అది సృష్టి నే నాశనం చేసే ప్రమాదం ఉందని మూడో ధారను తన తెగిన తలతో తాగేసింది. ఆమె తల తిరిగి అతుక్కున్నాక వాళ్ళు తిరిగి హిమాలయాలకు వెళ్ళారు. చిన మస్తా దేవి గురించి ఇంకా చాలా వెర్షన్స్, కథలు ఉన్నాయి. మరో వెర్షన్ లో క్షీర సాగర మథనం సమయం లో రాక్షసులకు అమృతం దక్క కూడదని చిన మస్తా దేవి దానవుల వంతు అమృతాన్ని రాక్షస రూపం లో తాగేసి తన గొంతు దిగే లోపులోనే తల నరికేసుకుందని ఒక కథనం ఉంది.ఎలా చూసినా చిన మస్త దేవి చరిత్ర అమృతం, శృంగారం, బలి, త్యాగం, అద్భుత శక్తులు, విధ్వంసం, మందాకిని,తాంత్రిక శక్తులతో నిండి ఉంది. మరి "వారణాసి" టైటిల్ టీజర్ లో రాజమౌళి ఉగ్రబట్టి గుహలో చిన మస్త దేవి విగ్రహాన్ని పై నుంచి పడుతున్న ప్రియాంక చోప్రా లాంటి అమ్మాయిని ఆమెను కాపాడడానికి ప్రయత్నిస్తున్న మహేష్ బాబు లాంటి వ్యక్తినీ చూపించారు. మరి ఇంతటి అద్భుతం వీరోచిత కథాంశంతో రాజమౌళి ఎలాంటి గ్రేట్ మూవీని మన ముందు ఉంచుతారో చూడాలి.

# మళ్లీ తెరపైకి విశాఖ స్టీల్ ప్లాంట్

**విశాఖపట్టణం, నవంబర్ 18, పెన్ పవర్:**విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. పనిచేస్తున్న ఉద్యోగుల విషయంలో టార్గెట్లు ఇచ్చింది యాజమాన్యం. చెప్పిన పనికి, ఆదేశించిన లక్ష్యానికి మేరకు జీతాల చెల్లింపు ఉంటుందని తేల్చి చెప్పింది. ఒక విధంగా చెప్పాలంటే ప్రైవేట్ సంస్థల ఫార్ములాను తెరపైకి తెచ్చింది. దీనిపై స్టీల్ ప్లాంట్ ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. ఇది ప్రైవేటీకరణకు ఉద్దేశించిన నిర్ణయమని తప్పుపడుతున్నాయి. అయితే అందులో తప్పేముందని.. ఉత్పత్తి పెరగాలంటే ప్రతి ఉద్యోగి పని చేయాల్సి ఉంటుందని తేల్చి చెప్పినట్లు అయింది. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచారం నడిచింది. ఇప్పుడు ఉత్పత్తి పెంపునకు సంబంధించి లక్ష్యాలు విధించడం సైతం అనుమానాలకు తావిస్తోంది. అయితే ఇది కంపెనీ వృద్ధి కోసమేనని.. స్టీల్ ప్లాంట్ ఉన్న పరిస్థితిని అధిగమించేందుకేనని విశ్లేషణలు వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో అనేక ప్రయోగాలు చేసింది యాజమాన్యం. అయితే ఉత్పత్తి పెరగకపోవడానికి మానవ తప్పిదాలు ఉన్నాయని భావించి ఈ లక్ష్యాలను విధించినట్లు తెలుస్తోంది.ప్రపంచంలోనే విశాఖ స్టీల్ ప్లాంట్ చాలా గుర్తింపు ఉంది.. ఇక్కడ స్టీల్ నాణ్యమైనదిగా గుర్తించి ఎక్కువగా అమ్మకాలు జరుగుతుంటాయి. అమ్మకాలకు తగ్గట్టు ఇక్కడ ఉత్పత్తి జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిన ఉత్పత్తి పెరగడం లేదు. ఎన్నో రకాల ఉత్పత్తి ప్రయోగాలు చేస్తున్న ఫలితం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో యాజమాన్యం ఉద్యోగులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఉత్పత్తి పెంపుదలకు సంబంధించి లక్ష్యాలను విధించింది. అయితే దీనిని వ్యతిరేకిస్తున్నాయి ఉద్యోగ సంఘాలు. కానీ కేంద్ర ప్రభుత్వ ఆలోచన వేరేలా ఉంది.కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అవుతోంది. దేశంలో ప్రైవేటు స్టీల్ ప్లాంట్లకు గనుల కేటాయింపు జరుగుతోంది. కానీ విశాఖ స్టీల్ ప్లాంట్ కు గనుల కేటాయింపు జరగకపోవడంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయంలో ప్రభుత్వ వాదన వేరేలా ఉంది. సమయానుకూలంగా స్టీల్ ఉత్పత్తులు ఇవ్వలేకపోతున్నామని.. ఇప్పుడు పని చేస్తున్న వారిలో కాంట్రాక్టు సిబ్బంది మాత్రమే మెరుగైన సేవలందిస్తున్నారని.. శాశ్వత ఉద్యోగులు సక్రమంగా పనిచేయడం లేదని.. వారు పనిచేస్తే ఉత్పత్తి ఎక్కడికో వెళ్లేదని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. అందుకే పనిచేసి విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టుకోవాలని ఉద్యోగులకు సూచిస్తుంది. అయితే సొంత గనులు లేకుండా అభివృద్ధి ఎలా అని కార్మికులు, ఉద్యోగులు ప్రశ్నిస్తుండగా.. ఉన్న వనరులతోనే ఉత్పత్తి అందించలేకపోతున్నారని.. కనులు కేటాయిస్తే ఏం చేస్తారులే అన్నట్టు మాట్లాడుతోంది కేంద్ర ప్రభుత్వం. మొత్తానికి అయితే విశాఖ స్టీల్ ప్లాంట్ అంశం ఎప్పుడు వార్తల్లో నిలిచేదే..!

## పాకిస్థాన్, శ్రీలంక, జింబాబ్వే జట్ల మధ్య ట్రై సిరీస్..

# స్క్వాడ్, టైమింగ్, షెడ్యూల్ వివరాలు!




**హైదరాబాద్ పెన్ పవర్:** ముక్కోణపు సిరీస్ క్రికెట్ ఫ్యాన్స్ ను అలరించడానికి సిద్ధంగా ఉంది. టీ20 ఫార్మాట్ లో పాకిస్థాన్, శ్రీలంక, జింబాబ్వే ట్రై సిరీస్ ఆడనున్నాయి. మంగళవారం (నవంబర్ 18) నుండి ప్రారంభం కానున్న ఈ టోర్నీ నవంబర్ 29 వరకు జరుగుతోంది. సొంతగడ్డపై జరగనుండడంతో పాకిస్థాన్ ఈ ట్రై సిరీస్ లో ఫేవరేట్ గా బరిలోకి దిగనుంది. శ్రీలంక జట్టు పోటీ ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు జింబాబ్వే సంచలన ఫలితం కోసం ఎదురు చూస్తుంది. మ్యాచ్ లన్నీ రావల్పిండి స్టేడియంలో జరుగుతాయి. భారత కాలమాన ప్రకారం సాయంత్రం 6:30 గంటలకు మ్యాచ్ లు ప్రారంభమవుతాయి. టాస్ 6 గంటలకు వేస్తారు. కాసేపట్లో ప్రారంభం కానున్న ఈ టోర్నీ తొలి మ్యాచ్ లో ఆతిధ్య పాకిస్థాన్ తో జింబాబ్వే తలపడుతోంది. మిగిలిన మ్యాచ్‌లు నవంబర్ 20, 22, 23, 25, 27 తేదీల్లో జరగనున్నాయి. టాప్-2లో నిలిచిన జట్లు నవంబర్ 29న ఫైనల్ ఆడతాయి. దురదృష్టవశాత్తు.. ఇండియాలో ఈ ట్రై సిరీస్ లైవ్ స్ట్రీమింగ్. లైవ్ టెలికాస్టింగ్ లేదు. స్పోర్ట్స్ టీవీ యూట్యూబ్ ఛానెల్‌లో మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారమవుతాయి. 2026 టీ20 వరల్డ్ కప్ కు ముందు మూడు జట్లకు ఈ సిరీస్ మంచి ప్రాక్టీస్ లా ఉంటుంది. పాకిస్తాన్ వైమానిక దాడి కారణంగా ఆఫ్ఘనిస్తాన్ ట్రై-సిరీస్ నుండి వైదొలిగిన సంగతి తెలిసిందే. ఆఫ్ఘనిస్తాన్ తప్పుకున్న ఈ సిరీస్ యధావిధిగా జరగనుంది. ఆఫ్ఘనిస్తాన్ స్థానంలో జింబాబ్వే ఈ ట్రై సిరీస్ ఆడనుంది.

**ట్రై-సిరీస్ షెడ్యూల్:**

నవంబర్ 18 - పాకిస్తాన్ vs జింబాబ్వే, 6:30 గంటలకు
నవంబర్ 20 - శ్రీలంక vsజింబాబ్వే, 6:30 గంటలకు
నవంబర్ 22 - పాకిస్తాన్ vs శ్రీలంక, 6:30 గంటలకు
నవంబర్ 23 - పాకిస్తాన్ vs జింబాబ్వే, 6:30 గంటలకు
నవంబర్ 25 - శ్రీలంక vs జింబాబ్వే, 6:30 గంటలకు
నవంబర్ 27 - పాకిస్తాన్ vs శ్రీలంక, 6:30 గంటలకు
నవంబర్ 29 - ఫైనల్, 6:30 గంటలకు

పాకిస్థాన్, శ్రీలంక, జింబాబ్వే స్క్వాడ్స్:

**పాకిస్థాన్:**
సల్మాన్ అఘా (కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజం, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీం, నసీమ్ షా, సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహీన్ అఫ్రిది, ఉస్మాన్ ఖాన్ మరియు ఉస్మాన్ తారిఖ్

**శ్రీలంక:**
పాతుమ్ నిస్సాంక, కుసల్ మెండిస్, కుసల్ పెరీరా, కమిల్ మిషార, దసున్ షనక (కెప్టెన్), కమిందు మెండిస్, భానుక రాజపక్స, జనిత్ లియానాగే, వనిందు హసరనాగ, మహేశ్ తీక్షణ, దుషన్ హేమంత, దుష్మంత చమీర, నువాన్ తుషార, మరియు ఎషాన్ మలింగ

**జింబాబ్వే:**
సికందర్ రజా (కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, ర్యాన్ బర్ల్, గ్రేమ్ క్రీమర్, బ్రాడ్లీ ఎవాన్స్, క్లైవ్ మదాండే, టినోటెండా మపోసా, వెల్లింగ్టన్ మసకద్జా, తాడివానాషే మారుమణి, టోనీ మున్యోంగా, తషింగా ముసెకివా, డియోన్ న్యువారి, రిచర్డ్‌డాన్‌గార్ టాయ్‌లోర్ మరియు

## కెప్టెన్‌ను ప్రకటించిన ఢిల్లీ క్యాపిటల్స్..

# మరోసారి ఆల్ రౌండర్‌పై నమ్మకం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ తమ కెప్టెన్ ను ప్రకటించింది. ఐపీఎల్ 2025 సీజన్ లో ఢిల్లీ జట్టును నడిపించిన అక్షర్ పటేల్ కే ఢిల్లీ క్యాపిటల్స్ పగ్గాలు అప్పగించారు. ఈ విషయాన్ని మంగళవారం (నవంబర్ 18) అధికారికంగా ప్రకటించింది. గత సీజన్ మెగా ఆక్షన్ కు ముందు ఢిల్లీ రూ. 16.50 కోట్లతో ఈ టీమిండియా ఆల్ రౌండర్ ను రిటైన్ చేసుకుంది. దీంతో ఐపీఎల్‌లో అక్షర్ కు తొలిసారి కెప్టెన్సీ దక్కింది. గత సీజన్ లో ప్లే ఆఫ్స్ కు తీసుకెళ్లడంలో అక్షర్ విఫలమైనప్పటికీ మరోసారి ఈ టీమిండియా ఆల్ రౌండర్ ను నమ్మి కెప్టెన్సీని కొనసాగించింది. ఇటీవలే ఆసియా కప్ కు అక్షర్ పటేల్ ను టీ20 వైస్ కెప్టెన్ గా తొలగించి అతని స్థానంలో యువ బ్యాటర్ శుభమాన్ గిల్ కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది జనవరిలో ఇంగ్లాండ్ తో జరిగిన టీ20 సిరీస్ లో అక్షర్ పటేల్ కు భారత వైస్ కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చినా ఒక్క సిరీస్ కే పరిమితమయ్యాడు. దేశవాళీ క్రికెట్‌లో గుజరాత్ జట్టును సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీ వంటి టోర్నీల్లో నడిపించాడు. 2025 ఐపీఎల్ సీజన్ లో అక్షర్ పటేల్ కెప్టెన్సీలో ఢిల్లీ క్యాపిటల్స్ 7 మ్యాచ్ ల్లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. కెప్టెన్ గా పర్వాలేదనిపించిన అక్షర్ 2026 ఐపీఎల్ లో ఢిల్లీ జట్టును ఎలా నడిపిస్తాడో ఆసక్తికరంగా మారింది.

కొన్ని నెలల క్రితం అక్షర్ ను ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ గా తొలగిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. మరోవైపు జట్టులో కేఎల్ రాహుల్ లాంటి అనుభవమున్న ప్లేయర్ ఉన్నప్పటికీ ఈ సీనియర్ ప్లేయర్ తాను కెప్టెన్ పదవి వద్దని చెప్పాడు. దీంతో సౌతాఫ్రికా యంగ్ ప్లేయర్ ట్రిస్టన్ స్టబ్స్ కు కెప్టెన్సీ బాధ్యతలు ఇస్తారనే వార్తలు వినిపించాయి. స్టబ్స్ కు అనుభవం లేకపోవడంతో అక్షర్ వైపే ఢిల్లీ మొగ్గు చూపింది. ఐపీఎల్ 2026 మినీ-వేలంలో ఢిల్లీ 21.8 కోట్లతో బరిలోకి దిగుతుంది. డిసెంబర్ 16 న ఐపీఎల్ మినీ వేలం అబుదాబిలో జరగనుంది.

**ఢిల్లీ క్యాపిటల్స్**

అక్సర్ పటేల్, కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, అభిషేక్ పోరెల్, ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, విప్రజ్ నిగమ్, అజయ్ మండల్, త్రిపురాన విజయ్, మాధవ్ తివారీ, మిచెల్ స్టార్క్, టి.నటరాజన్, ముఖేష్ కుమార్, దుష్మంత చమీర, కుల్దీప్ యాదవ్, నితీశ్ రానా.

రిలీజ్ ప్లేయర్స్: మోహిత్ శర్మ, ఫాఫ్ డు ప్లెసిస్, సెడికుల్లా అటల్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, మన్వంత్ కుమార్, దర్శన్ నల్కండే, డోనోవన్ ఫెరీరా


# 'ఐటమ్ భామ' అంటూ తక్కువగా చూసారు!- మలైకా

బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ మలైకా అరోరా వ్యక్తిగత, వృత్తిగత జీవితం ఎప్పుడూ హెడ్ లైన్స్ లో నిలుస్తుంది. యువహీరో అర్జున్ కపూర్ తో ఎఫైర్ కారణంగా నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లోకి వచ్చిన మలైకా అతడితో బ్రేకప్ అయ్యాక, ఇటీవల స్థబ్ధుగా ఉంది. కొంతకాలంగా తన కెరీర్ పైనే ఫోకస్ చేస్తోంది.అయితే మలైకా అరోరా భవిష్యత్ లో సినిమాల నిర్మాణం, దర్శకత్వం వైపు అడుగులు వేసే ఆలోచనలో ఉందా? అంటే దానికి అవకాశం లేకపోలేదని సమాధానం ఇచ్చింది. తనకు కెమెరా వెనక సాంకేతిక అంశాలపైనా ఆసక్తి ఉందని మలైకా తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. తెరవెనక చాలా అంశాలు ఆసక్తిని కలిగిస్తాయని, ఏదో ఒకరోజు ఆ పని చేస్తానని పేర్కొంది.

నటిగా పెద్ద స్థాయిని ఎందుకు కోరుకోరు? అని ప్రశ్నిస్తే... మొదటి నుంచి తాను నర్తకిగా కొనసాగానని, స్పెషల్ నంబర్లు చేయడం తన ప్రధాన బలం, ఆసక్తి అని చెప్పింది. నాకు ఎందులో బలం ఉందో అదే దారిలో వెళ్లానని చెప్పారు. ఒకానొక దశలో ఐటమ్ పాటను తక్కువగా చూసారు. ఐటమ్ నర్తకిని చిన్నగా చూసారు. కానీ కాలక్రమంలో అది మారింది. ఐటమ్ పాటలో నర్తించడం అంటే అందాలు ఆరబోయడం ఒక్కటే కాదు.. హావభావాల వ్యక్తీకరణ, క్రియేటివిటీ పరంగా సవాల్‌ని ఎదుర్కోవడం అని నెమ్మదిగా గ్రహించారని కూడా మలైకా అన్నారు. కథనాన్ని నడిపించే దమ్ము ఐటమ్ పాటలోను ఉంటుందని మలైకా అన్నారు. ఐటమ్ నంబర్ల మేకింగ్ పై ఇప్పుడు మంచి గౌరవం ఉందని అన్నారు. ఈమధ్యనే 50కి ఒక సంవత్సరం అదనంగా పెరిగింది. ఎప్పటికీ ఇదే ఉత్సాహం ఉంది నాలో. నాపై అభిమానం, ప్రేమ చూపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇన్నేళ్లుగా నన్ను ఆదరించిన వారందరికీ ప్రత్యేకించి కృతజ్ఞతలు అని అన్నారు. తన వ్యక్తిగత జీవితం గురించి ఎదురయ్యే ట్రోలింగ్ పైనా మలైకా మనసు విప్పి మాట్లాడారు. నిజానికి మనల్ని అనేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. కానీ నేను నాపై దృష్టి పెట్టడం నేర్చుకున్నాను. ప్రతికూలత నన్ను డిసైడ్ చేయనివ్వను. ట్రోల్స్ ఉంటాయి. కానీ నేను ఆ విషాన్ని స్వీకరించను. నా కుటుంబం, స్నేహితులు నాకు చాలా ముఖ్యం.. మనశ్శాంతి ఇంకా ఎక్కువ ముఖ్యం! అని అన్నారు. మలైకా ప్రస్తుతం డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా ఆర్జిస్తున్నారు. ఇండస్ట్రీలో టాప్ మోడల్ గా కొన్ని బ్రాండ్లతో కాంట్రాక్టుల ద్వారా కూడా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.



ప్రిషా రాజేష్ సింగ్ మోడ్రన్ డ్రెస్‌లో స్టన్స్, ఫ్యాషన్ ఫేవరెట్‌గా హృదయాలను గెలుచుకోవడం కొనసాగించింది





చీరలో మాల్వీ మల్హోత్రా స్టన్స్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965